సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 3-5-2024 15/-

## ఎన్నికల నియమావళి ఎక్కడ?








సహజీవన భావనల సాధ్యరాయి
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 18 హైదరాబాద్
శుక్రవారం 3 మే 2024 రూ.15-00
23 షవ్వాల్ 1445 హిజ్రీ

**తొలిగీటు**

మీలో ఎవరూ ఒక్క
పాదరక్షతో నడవరాదు.
రెండిటినీ తొడుక్కోవాలి లేదా
రెండిటినీ వదలివెయ్యాలి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com




## లోపల...

| | | |
|---|---|---|
| న్యూ ఇండియా | ...... | 04 |
| ఎన్నికల నియమావళి ఎక్కడ? | ...... | 05 |
| విచక్షణా ప్రమాణం-27 | ...... | 10 |
| చరితార్థులు-2 : షాహ్ ముహమ్మద్ జుబేర్ | ...... | 12 |
| దివ్యఖుర్ఆన్ మానవాళికి వెలుగుబాట | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| మానవ జీవిత లక్ష్యం ఏమిటి? | ...... | 20 |
| ఇస్లాంలో శుచీ శుభ్రతలకు ప్రాముఖ్యం | ...... | 25 |
| భూమిభారం పెరుగుతున్నదా? | ...... | 26 |
| నిరుద్యోగ సమస్యపై మౌనమేల? | ...... | 28 |
| డాటా కోసం కోటి ఉపాయాలు | ...... | 32 |

**ప్యాకేజీ స్టార్**



తెలుగుదేశం బీజేపీ
జన సేనల కూటమి
చిరంజీవి చీపుబ్రిక్కు
తప్పదోయి ఓటమి!
ఏదో ఇరగ దీస్తాడని
యిచ్చారట పద్మము
అందుకే అందుకుండు
స్వార్థముతో పద్యము!!
– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

# న్యూ ఇండియా

**దేశంలో** దాదాపు 20 కోట్ల ముస్లిం జనాభా ఉంది. ముస్లిములందరినీ చొరబాటుదారులని ప్రధాని మోడీ ఎలా చెప్పగలిగారు? వీర్ అబ్దుల్ హమీద్ వంటి సైనికులు, అబ్దుల్ కలామ్ వంటి శాస్త్రవేత్తలు ముస్లిములే, వీళ్ళు చొరబాటుదారులు కాదని ఆయనకు తెలియదా? ఆయన పార్టీలోనే ఉన్న ముక్తార్ అబ్బాస్ నక్వీ వంటి వారు కూడా చొరబాటుదారులు కాదని ఆయనకు తెలియదా? ఆయనకు బాగా తెలుసు... అయినా ఆయన ఈ మాటలు చెబుతారు..? ముస్లిములను ఉద్దేశించి అధిక సంతానం కలిగిన వాళ్ళని కూడా ఆయన చెప్పారు. దేశజనాభా వృద్ధిరేటు, ముస్లిముల వృద్ధిరేటు గణాంకాలు ఆయనకు తెలియవా? చాలా మంది ఈ విశ్లేషణలు చేశారు. ఆయనకు బాగా తెలుసు. అయినా ఆయన ఈ అబద్ధాలు నిర్లజ్జగా, నిస్సంకోచంగా చెబుతారు...?

ఎన్నికల కమీషన్ తననేమీ చేయదన్న ధైర్యంతో చెబుతున్నారనడం సరయిన విశ్లేషణ కాదు. ఎందుకంటే, ఎన్నికల కమీషన్ ఏమీ చేయక పోవచ్చు, కాని ఇలాంటి అబద్ధాలు విన్న ఓటర్లు ఊరుకుంటారా? పచ్చి అబద్ధాలను ఏవగించుకుని ఎన్నికల్లో బుద్ధి చెబుతారన్న భయం ఉంటే ఆయన ఇలాంటి అబద్ధాలు చెప్పే సాహసం చేసేవారు కాదు. కాని దేశంలో పరిస్థితి విభిన్నంగా ఉంది.

ఆయన మాదిరిగానే దేశంలో సగటు మోడీ అభిమానులకు కూడా నిజాలు, నిజనిర్ధారణలు పట్టవు. దేశంలో ప్రధాన ప్రతిపక్షం, కాంగ్రెసు పార్టీ దేశంలోని హిందూ మహిళల మంగళసూత్రాలను కూడా లాక్కుని సంపద అంతా ముస్లిములకు పంచిపెడుతుందని ఒక ప్రధాని చెప్పడం ఎంత హాస్యాస్పదం. దేశంలోని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెసు హిందువులకు హనుమాన్ చాలిసా కూడా చదవకుండా నిషేధిస్తుందని చెబితే దేశప్రజలు నమ్ముతారా .... నమ్ముతారనే ఆయన బలంగా నమ్ముతున్నారు. తాను ఏం చెప్పినా, ఆధారాలు లేకపోయినా, హాస్యాస్పదంగా ఉన్న, పచ్చి అబద్ధాలైనా ప్రజలు నమ్మేస్తారని ఆయన బలంగా నమ్ముతున్నారు. తానేం చేసినా... ఆహా... ఓహో... అనే ఒక ఓటుబ్యాంకు తనకు ఉందని ఆయనకు తెలుసు. అందుకే ఒక సభలో ముస్లిములను చొరబాటుదారులని చెప్పి, మరో సభలో తాను ముస్లిములకు చాలా చేశానని, హజ్ కోటా పెంచానని ముస్లిములను ఆకట్టుకునే ప్రసంగం చేయడానికి ప్రయత్నిం చినా ... ఈ వైరుధ్యాన్ని తనను గుడ్డిగా నమ్మే ఓటు బ్యాంకు ఎన్నడూ ప్రశ్నించదని కూడా ఆయనకు బాగా తెలుసు.

ఇప్పుడు బాహాటంగా, నిర్లజ్జగా ఇస్లామోఫోబిక్ వ్యాఖ్యలు చేయడం ద్వారా తన పార్టీలోని చిన్నా చితక నాయకులందరికీ ఆయన ఒక స్పష్టమైన సందేశం ఇచ్చేశారు. ఇక అందరూ ఈ బాటనే నడవాలన్నది ఎన్నికల వ్యూహంగా చెప్పేశారు.

ఆదిత్యనాథ్ కాంగ్రెసు అధికారంలోకి వస్తే షరియా రూల్ వస్తుందని అన్నాడు. కర్నాటకలో బీజేపీ సోషల్ మీడియా ప్రచారం పచ్చి అబద్ధాలను వైరల్ చేస్తోంది. కాంగ్రెసు మేనిఫెస్టోలో బలవంతంగా హిజాబ్ అమలు, ముస్లిములకు సంపద అంతా పంచిపెట్టడం ఉన్నాయని ప్రచారం చేస్తున్నారు. ఇవేవీ కాంగ్రెసు మేనిఫెస్టోలో లేవన్నది ఎవరైనా మేనిఫెస్టో చూసి తెలుసుకోవచ్చు. మోదీ భక్తజనానికి కూడా తెలుసు. అయినా ఇవన్నీ మేనిఫెస్టోలో ఉన్నాయని వాళ్ళు నమ్మడమే కాదు, అందరినీ నమ్మించడానికి చూస్తారు. ఎందుకంటే ఇలాంటి మాటలను విని నమ్మడా నికి సిద్ధంగా ఉన్న జనం పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారు. ఈ సమూహం ఇలాంటి అబద్ధాలను ఇంతకు ముందు వినడమే కాదు నమ్మి ఓట్లు కూడా వేసింది.

హఠాత్తుగా ఈ మతతత్వ ప్రచారం ఎందుకు పెంచారన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. మొదటి విడత పోలింగు చూసి భయపడ్డం వల్ల చేస్తున్నారా? లేక కాంగ్రెసు మేనిఫెస్టోలో ఉన్న గ్యారంటీలు, ప్రజా సంక్షేమం చూసి ఇలా చేస్తున్నారా అన్నది తేల్చడం కష్టం. కాని మతతత్వ ప్రచారం లాభదాయకం అన్నది బీజేపీకి బాగా తెలిసిన విషయం. ఈ ప్రచారంతో చాలా సార్లు లాభాలు పొందిన చరిత్ర కూడా ఉంది. దేశ ఆర్థికవ్యవస్థ జెట్ స్పీడులో అభివృద్ధి చెందుతుందంటారు. కాని ఆ అభివృద్ధి మొత్తం దేశసంపదను తమ గుప్పిట పెట్టుకున్న ఒక్కశాతం కుబేరులకే దక్కుతుందని, మోడీ కాలంలో దేశం బిలియనీర్ రాజ్‌గా మారిందని, సగటు ప్రజలు అప్పుల పాలవుతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో సంక్షోభం ఉందని, నిరుద్యోగం భయపెడుతుందని చెప్పినా చాలా మంది నమ్మడానికి సిద్ధంగా లేరు. ఎందుకంటే దేశం విశ్వగురుగా మారిపోయిం దన్న మోడీ మాటల్ని మాత్రమే నమ్మే స్థితికి చేరుకున్నారు. చైనాపై కళ్ళెర్రజేశానని ఆయన చెబితే చాలు నమ్మేస్తారు. చైనా మన సరిహద్దుల్లో చొరబడిందా లేదా అన్నది అనవసరమైన విషయంగా చాలా మందికి మారిపోతుంది. ఒక్క ఫోను కొట్టి రష్యా ఉక్రెయిన్ యుద్ధం ఆపేశానని చెబితే చాలు నమ్మేస్తారు. అలా జరగలేదని ప్రభుత్వమే చెప్పినా సరే నమ్మరు.

ప్రధాని మోడీ ప్రజాదరణకు ముఖ్యమైన కారణం ఏమిటి? ఆయన సగటు మనిషికి చేసింది ఏదీ లేదు. నిరుద్యోగం హిందువులను కూడా వేధిస్తుంది. అధికధరలు హిందువులను కూడా బాధపెడుతున్నాయి. గుజరాత్‌లో ఆయన గొప్ప అభివృద్ధి సాధించింది ఏదీ లేదని అనేక విశ్లేషణలు వచ్చాయి. అయినా ఈ ప్రజాదరణకు కారణం ఏమిటి అన్నది ఆలోచించవలసిన ప్రశ్న. దీనికి కారణం ఒక్కటే, దేశంలోని మతతత్వ శక్తులు సుదీర్ఘకాలంగా దేశప్రజల్లో ప్రచారంలో పెట్టిన ముస్లిం విద్వేషం చాలా మందిలో గూడుకట్టుకుని ఉంది. గుజరాత్ అల్లర్ల తర్వాత ముస్లిములకు గుణపాఠం నేర్పిన నాయకుడిగా ఆయన్ను వీళ్ళంతా గుర్తిస్తున్నారు. ముస్లిములను అణిచి, బుద్ధి చెప్పే నేతగా ఆయన అవతరించాడు. మీడియా ఆయన్ను హిందూ హృదయసామ్రాట్ చేసేసింది. ఇప్పుడు వీళ్ళందరికీ ఆయన భగవత్సమానుడు. కరోనా కాలంలో గంగానదిలో శవాలు ప్రవహించడం వంటి ఎన్ని వైఫల్యాలు ఆయన ఖాతాలో ఉన్నా వీళ్ళెవ్వరు పట్టించుకోరు. ఆయన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాకపోయినా వీళ్ళు ప్రశ్నించరు. నోట్లరద్దు వల్ల సాధించిందేమిటని అడగరు? ఎలక్టోరల్ బాండ్ల అవినీతి గురించి ఆలోచించడానికి కూడా ఇష్టపడరు. కొందరయితే పెట్రోలు లీటరు ఐదొందలైనా, గ్యాస్ సిలిండరు ఐదు వేల రూపాయలకు చేరుకున్నా ఫర్వాలేదు మోడీయే మళ్ళీ రావాలంటున్నారు.

ఈ వాతావరణంలో ప్రజాప్రయోజనాలు, సంపదపంపిణీ, ప్రజా సంక్షేమం, బడుగు బలహీనవర్గాల సాధికారత, మహిళల హక్కులు, విద్యా వైద్య సదుపాయాలు, ఉపాధి కల్పన, సమ్మిళిత అభివృద్ధి వంటి మాటలు కేవలం మాటలుగా మాత్రమే మిగిలిపోతాయి. ఈ మాటలు మోడీ కూడా చెబుతారు. ఆయన ఈ మాటలు చెప్పినప్పుడు, ఆయన మరో మాస్టర్ స్ట్రోక్ కొట్టాడని మోడీ అభిమానులు అనుకుంటారు. అది మాస్టర్ స్ట్రోక్ అని ముందే అనుకున్నారు కాబట్టి ఇచ్చిన హామీలు చునావీ జుమ్లాలని ముందే తెలుసు కాబట్టి దానిపై ప్రశ్నించవలసిన అవసరం లేదనుకుంటారు. కాబట్టి ఎప్పుడు ప్రశ్నించరు.

ఈ పరిస్థితి మారుతుందా? నిజమైన శ్రేయోరాజ్యం దిశగా మనం అడుగులు వేస్తామా?

అబ్దుల్ వాహెద్

# ఎన్నికల నియమావళి ఎక్కడ?



**ఎన్నికల్లో** ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావాలి. నిరుద్యోగం, రైతుసమస్యలు, అధికధరలు, పేదల కష్టాలు, వ్యవసాయ సంక్షోభం, కునారిల్లుతున్న ఆర్థిక ప్రగతి ఇవన్నీ ప్రస్తావనకు రావాలి. కాని ఈ ఎన్నికల్లో అవేవీ పాలకపక్షం ప్రస్తావించడం లేదు.

ఈసారి ఎన్నికలు ఏడు విడతలుగా జరుగుతున్నాయి. మొదటి విడత ముగిసింది. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ రాజస్థాన్ లో మాట్లాడుతూ ముస్లిములను "చొరబాటుదారులు" అన్నారు. కాంగ్రెసుపార్టీ అధికారంలోకి వస్తే హిందూ మహిళల బంగారు ఆభరణాలను, చివరకు మంగళసూత్రాలను కూడా లాక్కుని ముస్లిములకు పంచిపెడుతుందని చెప్పారు. కాంగ్రెసు పార్టీ మేనిఫెస్టో చూస్తే మనకు ఇలాంటి మాటలేవీ కనిపించవు. ఈ ప్రసంగం తర్వాత ఎన్నికల కమీషనుకు ఫిర్యాదులు వెళ్ళాయి. ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడమే కాదు, 17 వేల మంది ప్రజలు కూడా సంతకాలు చేసి ఎన్నికల కమీషనుకు పిటీషను పంపారు. కాని, గతంలో మోడీపై చేసిన ఫిర్యాదుల మాదిరిగానే ఈ సారి కూడా ఎన్నికల కమీషన్ ఎలాంటి చర్యలు తీసుకోదన్నది స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ విద్వేష ప్రచారాన్ని ఆయన ఒక సభలో మాట్లాడుతూ మాత్రమే చేయలేదు. ఇవే మాటలు మరో సభలో కూడా చెప్పారు. అంతేకాదు, కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే యస్సీ యస్టీ రిజర్వేషన్లలో కోత పెట్టి ఆ రిజర్వేషన్లు ముస్లిములకు పంచిపెడుతుందన్నారు. కాంగ్రెసు పార్టీ ముస్లిం బుజ్జగింపు రాజకీయాలు చేస్తుందన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన ఒక ప్రసంగం గురించి చెబుతూ, దేశ వనరులపై మొదటి హక్కు ముస్లిములకే ఉందని మన్మోహన్ సింగ్ చెప్పారన్నారు. నిజానికి మన్మోహన్ సింగ్ 2006లో చేసిన ఆ ప్రసంగంలో ముస్లిముల గురించి మాత్రమే కాదు, యస్సీ, యస్టీ, వెనుకబడిన వర్గాలు, మహిళలు అందరి గురించి మాట్లాడారు. ఈ విషయమై నిజనిర్ధారణలు అనేకసార్లు జరిగాయి. కాని ప్రధాని మోడీకి నిజాలతో పనిలేదు. మతవర్గాల మధ్య చిచ్చుపెట్టి తన రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవడమే ముఖ్యంగా ఆయన పనిచేస్తారన్నది పలుమార్లు రుజువయ్యింది. కాంగ్రెసు అనేకసార్లు ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిములకు రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రయత్నించిందని, కోర్టులు కల్పించుకోవడం వల్ల సఫలం కాలేకపోయిందని చెప్పారు. సచర్ కమిటీ సహా అనేక కమిటీలు ముస్లిముల్లో వెనుకబాటుతనం గురించి స్పష్టమైన నివేదికలు ఇచ్చి ఉన్నాయి. అలాంటప్పుడు వారిని ఆదుకోవడానికి రిజర్వేషన్లు కల్పించడం పాపమా? కాని బీజేపీ దృష్టిలో ఇది మహాపాపం. ముస్లిముల రిజర్వేషన్లు ఇతర వర్గాల రిజర్వేషన్లను తగ్గించి ఇవ్వడం జరగ

దన్నది కూడా పలుమార్లు విశ్లేషకులు వివరించారు. కాని ఈ అబద్ధపు ప్రచారంతో మోడీ మెజారిటీ ఓట్లను దండుకోవాలని చూస్తున్నారు.

మోడీ మాటల్లో వైరుధ్యాన్ని కూడా గమనించాలి. అలీగఢ్‌లో మాట్లాడుతూ ప్రధాని మోడీ తనను తాను ముస్లిముల ఉద్ధారకుడిగా చెప్పుకున్నారు. ఎందుకంటే, అలీగఢ్ లో ముస్లిం జనాభా ఎక్కువగా ఉంది. అంతకు ముందు ముస్లిములందరిని చొరబాటుదారులన్న మనిషి తర్వాత వారి కోసం తాను చాలా చేశానని చెప్పడం చాలా విచిత్రంగా మనకు కనిపించవచ్చు. కాని ఓట్లు సంపాదించుకోవడం తప్ప మరో విలువ ఏదీ లేని నేతలు ఇలాంటి మాటలే చెబుతారు. అబద్దాలు చెప్పడం, అసత్యాలు సత్యాలుగా ప్రచారం చేయడం, విద్వేషాన్ని రాజేయడం ఇదే రాజకీయంగా ఇప్పుడు మారిపోయింది.

కాంగ్రెసు మేనిఫెస్టోలో ఆదాయాల్లో అసమానతల గురించి ప్రస్తావించింది. అంబానీ, ఆదానీల ఆదాయం ఏటా 40 నుంచి 60 శాతం వరకు పెరుగుతుంటే సగటు మనిషి ఆదాయం ఐదు శాతం పెరగడం లేదు. ఇది ప్రధాని మోడీ పరిపాలనలోని ఒక చేదు వాస్తవం. గతంలో మన్మోహన్ సింగ్ చేసిన ప్రసంగం నిజానికి ఈ అసమానతలకు సంబంధించిందే. బలహీనవర్గాలు, కేవలం ముస్లిములే కాదు యస్సీ, యస్టీ, ఓబీసీ, మైనారిటీ, మహిళలకు వనరులపై మొదటి హక్కు ఉండాలని చెప్పారు. ఈ మాటలనే వక్రీకరించి ఇప్పుడు ప్రధాని ప్రచారం చేస్తున్నారు.

భారత రాజకీయాలను గత కొన్ని దశాబ్దాలుగా గమనిస్తున్న వారికి ప్రధాని మోడీ వ్యాఖ్యలు పెద్దగా ఆశ్చర్యం కల్పించవు. ఆయన అలా మాట్లాడకపోతేనే ఆశ్చర్యపోవాలి. ముస్లిం విద్వేష వ్యాఖ్యలను ఆయన పలుమార్లు చేశారు.

కాంగ్రెసు పార్టీ మేనిఫెస్టో విడుదల చేసినప్పుడు మోడీ దానిపై విమర్శలు చేస్తూ పాకిస్తాన్ ఏర్పాటుకు కారణమైన ముస్లిం లీగ్ మేనిఫెస్టోలా ఉందని అన్నారు. కాంగ్రెసు పార్టీని ముస్లిముల పార్టీగా చిత్రీకరించడం, ముస్లిములను దేశద్రోహు లుగా, చొరబాటుదారులుగా చిత్రీకరించడం, చొరబాటుదారు లను బుజ్జగించే పార్టీగా కాంగ్రెసును చూపించడం ద్వారా తామే అసలైన దేశభక్తులమని ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారు. తాము దేశభక్తులమని ప్రజలను నమ్మించాలంటే ప్రజల కోసం, దేశంకోసం ఏం చేశారో చెప్పుకోవాలి. నిరుద్యోగం పెరిగింది. ఆర్థికవ్యవస్థ కుదేలయ్యింది. అధికధరలతో ప్రజలు అల్లాడుతున్నారు. ప్రధానిగా ప్రజల కోసం ఆయన చేసింది ఏముందని చెప్పుకోడానికి? చెప్పుకోడానికి ప్రధాని మోడీ వద్ద ఏదీలేదు. అందువల్ల ఇక మిగిలిన మార్గం ప్రతిపక్షాలు దేశద్రోహులని చెప్పడం. మిగిలిన వారంతా దేశద్రోహులని ప్రజలను నమ్మిస్తే దేశభక్తులు కేవలం బీజేపీ వాళ్ళే అని ప్రజలు నమ్మి ఓటేస్తారన్నది అసలు ఆలోచన.

కాంగ్రెసు పార్టీ ఎన్నికై అధికారానికి వస్తే ప్రజల ఆస్తులను లాక్కుని, మహిళల మంగళసూత్రాలు కూడా లాక్కుని చొరబాటు దారులకు, అధికసంతానం కలిగిన వారికి పంచిపెడుతుందని అన్నారు. ఇక్కడ ఆయన చొరబాటుదారులు, అధికసంతానం కలిగినవారని చెబుతున్నది ముస్లిముల గురించి. అధిక సంతానం కలిగిన వారని చెప్పడం ద్వారా దేశ జనాభా పెరగడానికి కూడా వాళ్ళే కారణమని నమ్మించడం, అలాగే ముస్లిముల జనాభా పెరిగిపోతుందన్న భయాలు రెచ్చగొట్టడం కూడా ఈ ప్రసంగంలో ఉంది. గణాంకాలను పరిశీలిస్తే ముస్లిముల జనాభా వృద్ధి రేటు మిగిలిన సముదాయాలతో సమానంగానే ఉందన్నది స్పష్టంగా తెలుస్తుంది. ఏడుగురు పిల్లలు, ఆరుగురు పిల్లలున్న కుటుంబాలు మిగిలిన సముదాయాల్లో కూడా ఉన్నాయి. ఉదాహరణకు స్వయంగా మోడీ గారి తోడబుట్టిన వారు ఎంత మంది? మోహన్ భగవత్ తోడబుట్టిన వారు ఎంతమంది? ఇలాంటి లెక్కలు తీస్తే చాలా సామాజిక వాస్తవాలు అర్థమవుతాయి. కాని ఈ లెక్కలు తీసి మాట్లాడే తీరిక ఎవరికి ఉంది? ప్రధాని మోడీకి ఈ లెక్కలు గణాంకాలతో పనిలేదు. ఆయన తన అబద్దాల ప్రచారంతో ఈ ఎన్నికల్లో గట్టెక్కాలనుకుంటున్నారు.

ముస్లిం విద్వేష ప్రసంగాలు ఇదే మొదటిసారి కాదు. గుజరాత్ నరమేధం జరిగినప్పుడు ఒక ఇంటర్వ్యూలో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన మాట్లాడుతూ ఒక కుక్కపిల్ల కారు క్రింద పడి మరణించినా బాధపడతామని, అలాగే గుజరాత్ అల్లర్లలో మరణించిన వారి పట్ల కూడా బాధపడుతున్నానని అన్నారు.

బీజేపీ నేతలు ఎన్నికల్లో ముస్లిం విద్వేష ప్రసంగాలు చేయడం మామూలే. గతంలో కూడా చాలా మంది చేశారు. ఎన్నికల కమీషన్ వారిపై చర్యలు తీసుకున్న ఉదాహరణలు అరుదు. గతంలో ఉత్తరప్రదేశ్ సహరాన్ పూర్‌లో యోగీ ఆదిత్యనాథ్ ప్రసంగిస్తూ కాంగ్రెస్‌పై దాడి చేశాడు. అప్పట్లో సహరాన్ పూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఇమ్రాన్ మసూద్ పై దాడి చేశాడు. ఉగ్రవాది

మసూద్ అజహర్‌కు కాంగ్రెస్ అభ్యర్థి ఇమ్రాన్ మసూద్ అల్లుడన్నట్లు మాట్లాడాడు. గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ అప్పట్లో మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే పాకిస్తాన్‌లో దీపావళి జరుపుకుంటారని వ్యాఖ్యానించాడు. ఈ నేతల మాటలకు అర్థమేమిటి? ఈ దేశంలో ఒక్క బీజేపీ తప్ప మిగిలిన పార్టీలన్నీ దేశద్రోహులకు టికెట్లిచ్చే పార్టీలనీ, దేశంలో ప్రతిపక్షమంటే దేశద్రోహుల పార్టీలనీ, దేశభక్తి కేవలం బీజేపీకి మాత్రమే గుత్తసొత్తు అని ప్రజలను నమ్మిస్తున్నారు.

ఏది ఏమైనా భారత ఎన్నికల్లో గత కొన్ని దశాబ్దాలుగా ముస్లిములు, పాకిస్తాన్ వంటి పదాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. గతంలో బీహారు ఎన్నికల ప్రచారంలో అమిత్ షా కూడా కాంగ్రెస్ గెలిస్తే పాకిస్తాన్‌లో టపాకాయలు కాల్చి పండగ చేసుకుంటారని చెప్పాడు.

గత ఎన్నికల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఉత్తర ప్రదేశ్‌లోని అమేథీతోపాటు కేరళలోని వయనాడ్ నుంచి కూడా పోటీ చేయాలని నిర్ణయించారు. దీన్ని మోడీ విమర్శించారు. 'హిందూ ఉగ్రవాదం' అనే పదజాలాన్ని కాంగ్రెస్ రూపొందించిందని, 5,000 సంవత్సరాల నుంచి ఉన్న హిందూ సంస్కృతిని అవమానించిందని విమర్శించారు. హిందువులు అధికంగా ఉన్న నియోజకవర్గం నుంచి పోటీ చేసే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. మెజారిటీ ప్రజల జనాభా తక్కువగా ఉన్న స్థానం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకుందన్నారు. గత ఎన్నికల్లో మహారాష్ట్రలోని వార్ధాలో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ ఈ మాటలన్నారు. హిందువులు అధికంగా ఉండే నియోజకవర్గం నుంచి పోటీ చేసే ధైర్యం రాహుల్‌కి లేదని చెప్పడం ఎంతవరకు నిజం. అమేథీలో హిందువులు అధికంగానే ఉన్నారు కదా. అక్కడి నుంచి ఆయన గెలిచాడు కదా? హిందువులు అధికంగా ఉన్న నియోజకవర్గం నుంచి పోటీ చేసే ధైర్యం రాహుల్‌కి లేదని చెప్పడం వెనుక ప్రధానోద్దేశ్యం రాహుల్ హిందువులకు వ్యతిరేకం అని చెప్పడం. ఇదంతా గత ఎన్నికల్లో జరిగిన వ్యవహారం. ఇదే వ్యవహారం ఇప్పుడు జరుగుతోంది. ఇంత నిస్సిగ్గుగా మతాన్ని ఎన్నికల కోసం వాడుకోవడం గతంలో ఎప్పుడైనా జరిగిందా?

గత ఎన్నికల్లో కాంగ్రెసు విషయంలో మోడీ చేసిన వ్యాఖ్యలు కూడా గమనించడం అవసరం. "హిందూ ఉగ్రవాదం అనే పదజాలానికి వాళ్ళు జన్మనిచ్చారు. హిందువులకు ఉగ్రవాదులనే పేరును తగిలించి పాపం చేశారు. ఇప్పుడు హిందువులు మెజారిటీగా ఉన్న స్థానం నుంచి పోటీ చేయడానికి భయపడుతున్నారు. అందుకే వాళ్ళు మైనారిటీ ప్రజలు ఎక్కువగా ఉన్న స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు" అని మోదీ అప్పట్లో అన్నారు. ఈ మొత్తం ప్రసంగంలో గమనించవలసిన విషయమేమంటే, కాంగ్రెస్ హిందువులకు ద్రోహం చేసింది. కాంగ్రెస్ హిందువులకు శత్రువు వంటిది, అందువల్ల కాంగ్రెస్‌కు మెజారిటీ హిందువులుండే నియోజకవర్గం నుంచి పోటీ చేసే దమ్ములేదు. ఇది గత ఎన్నికల్లో చెప్పిన మాట. ఇప్పుడు మోడీ కాంగ్రెసు చొరబాటుదారులకు హిందువుల ఆస్తులు పంచి ఇచ్చేస్తుందని అంటున్నారు. ఇక్కడ చొరబాటుదారులంటే ముస్లిములు. క్లుప్తంగా అర్థమయ్యేదేమంటే, కాంగ్రెసు ముస్లిముల పార్టీ అని, ముస్లిములు చొరబాటుదారులని, కాబట్టి కాంగ్రెసు చొరబాటుదారుల కోసం పని చేస్తున్న పార్టీ అని దేశప్రజలను నమ్మించడం, బీజేపీ మాత్రమే హిందువుల పార్టీ కాబట్టి హిందువులందరూ బీజేపీకి ఓటు వేయాలని చెప్పడం. ఇది 80 వర్సెస్ 20 ఫార్ములా. దేశంలోని అధికశాతం ప్రజలు హిందువులు, కాబట్టి వారందరినీ మభ్యపెట్టి వారి ఓట్లు పొందితే చాలు అధికారం సొంతం అనే ఫార్ములా ఇది. ఈ ఫార్ములా ఇప్పటి వరకు బాగానే పనిచేస్తూ వచ్చింది. అందుకే బీజేపీ నేతల నోటి నుంచి హిందు, హిందు అనే మాట తప్ప భారతదేశం, దేశంలోని దళితులు, బడుగు బలహీనవర్గాల సమస్యలు, వారి జీవితాలు, దేశశ్రేయస్సు అనే మాటలు వినబడడమే లేదు. దేశంలో హిందువులైనా, ముస్లిములు, క్రయిస్తవులు, శిక్కులు, పార్శీలు, బౌద్ధులు, జైనులు ఎవరైనా గానీ ఈ దేశ ప్రజలే. హిందూ మెజారిటీ ఉన్న ప్రాంతంలో పోటీ చేయడమే దేశభక్తికి గీటురాయి అవుతుందా? మైనారిటీ సముదాయం ప్రజలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం నుంచి పోటీ చేయడం దేశ భక్తికి వ్యతిరేకమా? దేశంలో రాజకీయాలను ఏ స్థాయికి బీజేపీ దిగజార్చిందో ఈ మాటల వల్ల స్పష్టంగా అర్థమవుతుంది. ఎంతగా దిగజారాయన్నది అర్థం చేసుకోవాలంటే కొన్ని సంఘటనలతో పోల్చి చూసుకోవడం అవసరం. 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్‌లో గొప్ప నాయకుడు, నెహ్రూ కేబినేటులో విద్యా మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ను ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ నుంచి పోటీ చేయండని నెహ్రూ కోరారు. మౌలానా కాస్త అయోమయంగా, మరికాస్త ఆసక్తిగా ఆ నియోజకవర్గమే ఎందుకు ఎంపిక చేశారని నెహ్రూను అడిగారు. రాంపూర్‌లో ముస్లిం జనాభా చాలా ఎక్కువ. కాబట్టి మీరు అక్కడ గెలుపొందడం తేలికవుతుంది అన్నారు నెహ్రూ. మౌలానా వెంటనే నెహ్రూకు

జవాబిస్తూ, నేను కేవలం ముస్లిముల నాయకుడిని కాదు, ఇండియాకు నాయకుడిని అంటూ నెహ్రూ ఆఫర్‌ను తిరస్కరించారు. మోడీ మంత్రివర్గంలో, బీజేపీ పార్టీలో ఎవరైనా ఈ ప్రజాస్వామిక సూత్రాన్ని ఆయనకు చెప్పేవారున్నారా?

పార్టీలు, నేతలు అభ్యర్థులు జాతి, కుల, మత, ప్రాంతీయపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తించకూడదు. ఇతర రాజకీయ పార్టీలను విమర్శించేటప్పుడు వాటి గత చరిత్రను, ఇంతకు ముందు పనితీరును మాత్రమే దృష్టిలో ఉంచుకోవాలి. ప్రజా జీవితంతో సంబంధంలేని, వ్యక్తిగత దూషణలు చేయకూడదు. రాజకీయ ప్రకటనల ద్వారా కుల,మతపరమైన అభ్యర్థనలు చేయకూడదు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థన, పవిత్ర స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు. ఇవి ఎన్నికల నియమావళిలోని అంశాలు. రాజకీయాల్లో మర్యాదా సంక్షోభం నెలకొందని భారత ప్రధానిగా వాజ్‌పేయి లోగడ నిష్ఠుర సత్యం పలికారు. అది ఇప్పుడు తారాస్థాయికి చేరింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిర్దేశాలను తుంగలో తొక్కి మాట్లాడుతున్నారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి క్షణం కూడా ఆలోచించడం లేదు. ఎందుకంటే బీజేపీ ప్రభుత్వం ప్రజల బాగు కోసం చేసిన పని ఒక్కటి కూడా లేదు చెప్పుకోడానికి. బీజేపీ ప్రభుత్వం ఏం చేసిందని ఆలోచిస్తే, ఉద్యోగాల కల్పనలో వైఫల్యం, ఉపాధి కల్పనలో వైఫల్యం, ఆర్థికరంగంలో వైఫల్యం, ఆదాయల్లో అసమతుల్యం, విద్యా,వైద్యరంగాల్లో వైఫల్యాలు... చేసిందేమిటంటే, జమ్ము కశ్మీరులో 370 అధికరణ తొలగించడం, దీనివల్ల సాధించిందేమిటో ఇంతవరకు స్పష్టం కాలేదు. పౌరసత్వ సవరణ చట్టం తీసుకురావడం. దీనివల్ల ఏం సాధించారు? ఎంతమందికి పౌరసత్వం ఇచ్చారు? త్రిపుల్ తలాక్ చట్టం తీసుకురావడం. దీనివల్ల ఎంతమందికి ప్రయోజనం కలిగిందో లెక్కలు ప్రకటిస్తే బాగుండేది. అయోధ్యలో రామమందిరం నిర్మించడం. ఇవన్నీ ఏదో ఒకరూపంలో ముస్లిములతో సంబంధం ఉన్న అంశాలే. బీజేపీ రాజకీయాలన్నీ ముస్లిం వ్యతిరేకత చుట్టే తిరుగుతుంటాయన్నది కాస్త ఆలోచించినా అర్థమయ్యే విషయం. ముస్లిం వ్యతిరేకత వల్ల దేశప్రజలకు ప్రయోజనమేమిటి. దీనివల్ల ఉద్యోగాలు వస్తాయా? ఉపాధి అవకాశలు పెరుగుతాయా? ఆర్థికవ్యవస్థ బాగుపడుతుందా? విద్యా వైద్యరంగాల్లో మార్పు వస్తుందా? రోడ్లు బాగుపడతాయా?

సగటు ప్రజలకు ఒనగూడిన ప్రయోజనాలు ఏవీ లేవు. ప్రజల కోసం చేసింది ఏదీ లేదు కాబట్టి హిందూ ముస్లిం రాజకీయాలు చేయడమే గెలుపు సాధించే ఏకైక మార్గంగా బీజేపీ భావిస్తుంది. అందుకే విద్వేష రాజకీయాలు మరోసారి వేడిగా నడుపుతోంది. ఈ క్రమంలో ఎన్నికల నియమావళిని తుంగల్లో తొక్కుతుంది. గతంలో కూడా బీజేపీ నేతలు ఇలాంటి ప్రచారాలే చేసి విజయాలు సాధించారు. గతంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత సైన్యాన్ని 'మోడీ సేన'గా చెప్పాడు. యోగీ చేసిన వ్యాఖ్యలు అప్పుడు రాజకీయంగా దుమారం రేపాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఘజియాబాద్‌లోని ఒక ర్యాలీలో యోగీ మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్ష నేతలు తీవ్రంగా తప్పుపట్టారు. 'కాంగ్రెస్ నేతలు ఉగ్రవాదులకు బిర్యానీలు పెట్టి పోషించారు. కానీ మోడీ సేన మాత్రం ఉగ్రవాదులకు తూటాలు, బాంబులతో సమాధానం చెబుతోంది' అని ఆయన వ్యాఖ్యానించారు. యోగీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి ప్రియాంక చతుర్వేదీ స్పందిస్తూ.. భారత ఆర్మీని ఆదిత్యనాథ్ కించపరిచారన్నారు. సైన్యం అనేది ప్రయివేటు సంస్థ కాదని, దీనిపై యోగీ తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. యోగీ వ్యాఖ్యలను సైన్యానికి చెందిన ఉన్నతాధికారులు అప్పట్లో ఖండించినట్లు సమాచారం. భారత సైన్యాన్ని, మోదీ సైన్యం అని ఎలా అంటారని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. బాలాకోట్ వైమానిక దాడులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడటం మాత్రమే కాదు...భారత సైన్యం తమ సొంత సేనగా పేర్కొనడం దారుణమని మమతా బెనర్జీ విమర్శించారు. గత ఎన్నికల్లో జరిగిందేమిటంటే, మోదీ ప్రభుత్వం అనేక రంగాల్లో విఫలమైన తర్వాత, ఎన్నికల్లో గెలుపొందడానికి జాతీయ భద్రతను ప్రచారంలో ప్రధానంగా వాడుకుంది. భారత సైన్యాన్ని మోడీ సేనగా వర్ణించడం ద్వారా సైన్యం సాధించిన విజయాలను బీజేపీ ఖాతాలో వేసేయాలని యోగీ ఆదిత్యనాథ్ అప్పట్లో ప్రయత్నించాడు. పాకిస్తాన్ నుంచి విడుదలై వచ్చిన వింగ్ కమాండర్ ఫోటోను ప్రచారానికి వాడుకోవడం మనకు తెలుసు. పుల్వామాలో అమరులైన సిఆర్పీఎఫ్ జవాన్ల ఫోటోలు వాడుకున్నారు. మై భీ చౌకీదార్ అంటూ ప్రారంభించిన ప్రచారంలో ఒక వీడియోలో నరేంద్రమోదీని యుద్ధట్యాంకులో చూపించారు. బీజేపీ నేతలు మిలిటరీ యూనిఫాం ధరించి కార్యక్రమాల్లో పాల్గొన్న వార్తలు వచ్చాయి. బాలాకోట్ వాయు సేన దాడుల తర్వాత బీజేపీ ఎం.పీ.మనోజ్ తివారీ మిలిటరీ

యూనిఫాం ధరించి ఒక ర్యాలీలో పాల్గొన్నాడు. ఈ యూనిఫాం ధరించడం గర్వంగా ఉందని అన్నాడు. కాని ఆ యూనిఫాం ధరించే అర్హత మిలిటరీలో పనిచేసే వారికి మాత్రమే ఉంటుం దన్నది ఆయన మరిచిపోయాడు. క్లుప్తంగా చెప్పాలంటే, గత ఎన్నికల్లో భారత సైన్యం సాధించిన విజయాలను బీజేపీ తన విజయాలుగా ప్రచారం చేసుకుంది.

ఎన్నికల నియమావళి ఇప్పుడు అలంకారప్రాయంగా మిగిలి పోయింది. భారతదేశం జయప్రదంగా యాంటి శాటిలైట్ మిస్సైల్ పరీక్ష నిర్వహించిందన్న ప్రకటన అప్పట్లో శాస్త్రవేత్తలు చేయలేదు, ప్రధాని మోడీ స్వయంగా ప్రకటించారు. భారతీయ జనతాపార్టీ మంత్రులు వెంటనే ట్విట్టర్లో ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. తమ పార్టీ నినాదం "అసాధ్యం ఇప్పుడు సాధ్యమయ్యిందంటూ" ట్వీట్లు చేశారు. ఇది జరిగింది అప్పట్లో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పుడే. ఇలాంటి ప్రకటనలు ప్రధాని చేయడం సముచితమా అనేది ప్రశ్న. అప్పుడు చేసిన మిస్సైల్ ప్రయోగం ద్వారా భారతదేశం రోదసీలో ఉన్న ఉపగ్రహాన్ని నేలకూల్చే సామర్థ్యం ఉన్నట్లు ప్రకటించింది. నిజానికి ఈ సామర్థ్యం భారతదేశానికి చాలా కాలం నుంచి ఉ ఒదన్నది అనధికారిక సమాచారం. ఈ ప్రకటన వల్ల ప్రధాని మోడీకి జాతీయ మీడియాలో అసాధారణ కవరేజి దొరికిందన్నది వాస్తవం. మంత్రులంతా బీజేపీ స్లోగన్ "అసాధ్యం ఇప్పుడు సుసాధ్యం" అంటూ ప్రచారం చేసే అవకాశం దొరికింది.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించి అనేక ఆరోపణలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. గతంలో ఇంత ఎక్కువగా ఆరోపణలు ఎన్నడూ రాలేదు. నరేంద్రమోడీ జీవిత చరిత్రపై ఒక సినిమా గత ఎన్నికల సందర్భంగా విడుదలయ్యింది. ఈ సినిమా రికార్డు టైములో తీశారు. జన వరి నెలాఖరున సినిమా తీయబోతు న్నారన్న ప్రకటన వచ్చింది. ఏప్రిల్ 5వ తేదీన విడుదలకు కూడా సిద్ధమై పోయారు. మరో సినిమా యాక్సిడెం టల్ ప్రైం మినిస్టర్ పేరుతో మాజి ప్రధాని మన్మోహన్ సింగ్‌పై విడుదల అయ్యింది. మన్మోహన్ సింగ్‌పై విమర్శ, ఆయన్ను బలహీనమైన ప్రధానిగా చూపించిన సినిమా తర్వాత అత్యంత బలవంతుడైన బాహుబలి ప్రధాని మోదీ గురించి మరో సినిమా దేశప్రజలు చూడ్డానికి విడుదల చేశారు. ఈ సినిమా విడుదలకు కోర్టులు కూడా లైన్ క్లియర్ చేసేశాయి. ఈ తతంగమంతా గత ఎన్నికల్లో ప్రజలు చూశారు. అంతేకాదు, మరో వైపు నమో టీవీ అంటూ కొత్త టీవీ ఎలాంటి అనుమతులు లేకుండా వచ్చింది. ఇందులో 24 గంటలపాటు ప్రధాని నరేంద్ర మోదీ వివిధ ప్రాంతాల్లో చేస్తున్న ఎన్నికల ప్రసంగాల ప్రత్యక్ష ప్రసారాలను ఎప్పటికప్పుడు ప్రసారం చేయడంతోపాటు వాటిని మళ్లీ మళ్లీ రిపీట్ చేస్తోంది. సెక్యూరిటీ క్లియరెన్స్ లేదా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అసలు అనుమతికి ఎలాంటి దరఖాస్తును కూడా సమర్పించకుండానే ఈ టీవీ ఛానల్ ప్రసారం అయ్యిందని వార్తలు వచ్చాయి.

ఎన్నికల నియమావళి కేవలం అలంకారప్రాయంగా మారిందని చెప్పడానికి మరో ఉదాహరణ గతంలో రైల్వేశాఖ మోడీ ఫోటోతో సుమారు లక్ష టిక్కెట్లను ముద్రించింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల సంఘానికి లేఖ రాసి, రైల్వే శాఖ బీజేపీ ప్రభుత్వానికి లబ్ధి చేకూర్చేలా మోదీ ఫొటో కలిగిన టిక్కెట్లను విక్రయిస్తోందని ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రైల్వే, ఎయి రిండియా... ఈ రెండు సంస్థలను పర్యవేక్షించే మంత్రిత్వ శాఖ లకు ఎన్నికల సంఘం నోటీసులు పంపింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఆయా సంస్థలు జారీ చేసే టికెట్లపై ప్రధాని నరేంద్ర మోడీ ఫొటోలను ఎందుకు ముద్రిస్తు న్నారో తెలపాలంటూ ఈ నోటీసులు జారీ చేసింది. ఎయిర్ ఇండియా టిక్కెట్లపై ప్రధాని మోదీ బొమ్మల వివాదం సమసి పోకముందే శతాబ్ది రైళ్లలో అందించే డిస్పోజబుల్ టీ కప్పులపై "మై భీ చౌకీదార్" అని కాంపెయినింగ్ నడిచింది. శతాబ్ది రైళ్లలో చౌకీదార్ ప్రకటనలు ఉన్న డిస్పోజబుల్ కప్పులు దర్శనమివ్వగా నెటిజన్లు ట్విట్టర్ ద్వారా డిస్పోజబుల్ టీ కప్ ఫోటోలు షేర్ చేసి రైల్వేస్ నిర్వాకంపై విమర్శలు గుప్పిం చారు. ఎన్నికల నియమావళిని ఎన్ని రకాలుగా ఉల్లంఘించాలో అన్ని రకాలుగా ఉల్లంఘనలు జరుగుతున్నాయి.

మొదటి విడత పోలింగ్ తర్వాత బీజేపీకి వ్యతిరేక గాలులు వీస్తున్నట్లు స్పష్టంగా అర్థమయ్యింది. అందుకే విద్వేష రాజకీయాలను రాజేయడం మరింత తీవ్రం చేసింది. గతంలో ఎన్నికల ప్రయోజనాలు సాధించడానికి ఈ రాజకీయాలే ఉప యోగపడ్డాయి. ఈ విద్వేష రాజకీయాలకు జవాబిచ్చే రియాక్షనరీ రాజకీయాలు ప్రతిపక్షాలు చేస్తే బీజేపీ పథకం పారినట్లే. ఉద్యోగాలు, ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన, ఆదాయాల పెంపు, విద్యవైద్య సదుపాయాల వంటి అసలు సమస్యల నుంచి ప్రతి పక్షాలు పక్కకు తప్పుకోరాదు. ఈ సమస్యలనే ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్ళవలసిన అవసరం ఉంది. ☐

# విచక్షణా ప్రమాణం

ఎస్.ఎమ్. మలిక్

## ఆయన ఠీవి, దర్పం

మహనీయ ఉమర్(ర) ఎంతో నిరాడంబర జీవితం గడిపినా, అతుకుల చొక్కా ధరించి నేలపైన కూర్చున్నా ఆయన దర్పం, ఠీవి వల్ల జనుల్లో ఆయన పట్ల ఆదరణ పూర్వకమయిన భయం వ్యాపించి ఉండేది. దాని వల్ల ప్రజలు తలబిరుసు తనం నుంచి దూరంగా ఉంటూ ఆచరణలో విచ్ఛిన్నం కాకుండా ఉండేవారు. దీనికి మహత్తర తార్కాణం, మహనీయ ఖాలిద్ బిన్ వలీద్ తొలగింపు.

మహనీయ ఖాలిద్ బిన్ వలీద్(ర), తన విజయ పరంపర అనుభవాల కారణంగా ఖ్యాతి శిఖరానికి చేరినప్పుడు జనం ఆయన్ని మహా నాయకునిగా భావించేవారు. కడకు ఆయన లేకపోతే విజయం ప్రాప్తించడం అసాధ్యమని అనుకునేవారు. అటువంటి సందర్భాన, మహనీయ ఉమర్(ర) ఆయన్ని పదవి నుంచి తొలగించి ఓ సాధారణ సిపాయిగా పని చేయాలని సూచించారు. మహనీయ ఖాలిద్, ఒక్క క్షణం కూడా జాగు చేయకుండా దాన్ని శిరసావహించారు. అది అతి సున్నితమయిన సమయం, ఆ సమయంలో ఆయన నాయకత్వం సేనకు ఎంతో అవసరం అని తలచేవారు అందరూ.

ఇస్లామీయ యోధులు యర్మూక్ పోరాటంలో రోమనుల కెదురుగా మార్కొనేందుకు సిద్ధమవుతున్న తరుణం అది! మహనీయ ఖాలిద్‌ని తొలగించి మహనీయ అబూ ఉబైదా బిన్ జర్రాహ్(ర)ని సేనాధిపతిగా నియమించారు. అప్పుడు ఓ సైనికుడు, "ఈ తొలగింపు ఏదయినా ఉపద్రవానికి దారి తీయవచ్చు" అని సంశయం వెలిబుచ్చాడు. అది విని మహనీయ ఖాలిద్, "మహనీయ ఉమర్ బ్రతికి ఉన్నంత కాలం ఏ ఉపద్రవం కూడా తలెత్తే అవకాశం లేదు" అని ధైర్యం చెప్పారు.

## ప్రజారోగ్యం పట్ల జాగరూకత

ప్రజల ఆరోగ్యం విషయంలో మహనీయ ఉమర్(ర) ప్రత్యేకంగా శ్రద్ధ చూపేవారు. స్థూలకాయం గురించి జనులకు హెచ్చరించేవారు. శారీరక భారం తగ్గించాలని బోధించేవారు. చురుగ్గా, ధైర్యంగా, పూర్తి బలం ప్రయోగించి పని చేయాలంటే తక్కువ బరువు తోనే సాధ్యమవుతుందని చెప్పేవారు. సాధారణంగా ఇలా పురమాయించేవారు,

> "జనులారా! కడుపు నిండా భుజించకండి, దానివల్ల ఆరాధనల్లో అలసట, శరీరంలో అలజడి, రకరకాల రోగాలు ఉత్పన్న మవుతాయి. దైవం కూడా స్థూలకాయులయిన పండితుల్నీ ఇష్ట పడడు. ఆహారం మితంగా

భుజించండి, దీనివల్ల పొదుపు తోపాటు శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి, పరమ ప్రభువు దాస్యం స్థయిర్యంగా చేయడం సుసాధ్యమవుతుంది. మనిషి కాంక్షలు అతని ధర్మ పాలన పైన ఆధిక్యత సాధించనంత వరకు వినాశానికి గురికాడు, జాగ్రత్త!''

ఒకసారి ఓ బొజ్జ ఆసామిని చూసి మహనీయ ఉమర్(ర) అడిగారు, ఇదేమిటీ అని. అతను ఆనందంగా, ''ఇది దైవ ప్రసాదిత శుభం, సమృద్ధి'' అని సమాధానం ఇచ్చాడు. దానికి ఆయన, ''నీవు అపార్థం చేసుకున్నావు మిత్రమా, ఇది దైవం వేసిన శిక్ష'' అని హెచ్చరించారు.

ఎవరయినా అంటు వ్యాధి లేదా భయంకర వ్యాధికి గురయి ఉన్నట్లయితే వ్యాధి వ్యాపించే ప్రమాదం వల్ల వారి రాకపోకల పైన ఆంక్షలు విధించే వారు. అలాంటి వారితో కలవడాన్నీ నిషేధించే వారు. వారిని ఇంటి పట్టున ఉండాలని ఆదేశించే వారు. వారు స్వస్థత పొందిన తరువాత నిషేధం తొలగించే వారు.

ఒకసారి ఓ కుష్టు వ్యాధి గల స్త్రీ దైవ గృహం కాబా ప్రదక్షిణ చేస్తూ కనిపిస్తే ఆమెను, ''ఓ దైవ దాసీ! నీవు జనులకు బాధ కలిగించడం కన్నా ఇంటి పట్టున ఉండటం మేలయినది కదమ్మా!'' అని వారించారు. ఆమె అలాగే చేశారు. కొంత కాలం తరువాత ఒక వ్యక్తి వచ్చి ఆమెను పలకరింపుగా, ''నిన్ను దైవ గృహం ప్రదక్షిణ చేయకుండా ఆపిన వారు ఇక లేరు, నీవు ఇప్పుడు ప్రదక్షిణ చేసుకోవచ్చు'' అన్నాడు. దానికి ఆమె, ''దైవం మీద ఒట్టు! నేను మహనీయ ఉమర్(ర) బ్రతికి ఉంటే ఆయన విధేయత పాటించి ఆయన పరమపదించగానే అవిధేయురాలవడాన్ని ఇష్ట పడను'' అన్నారు.

### ప్రభుత్వ బాధ్యులకు కానుకలు

మహనీయ ఉమర్ ఫారూక్(ర) ప్రభుత్వ కోశాధికారిని పిలిపించారు. ఆయన వచ్చేవరకు ఉమర్ తన కుమారుడు ఆసిమ్‌ని ఏదో విషయం పట్ల చీవాట్లు పెడుతున్నారు. కోశాధికారితో, ''నీకు తెలుసా, ఇతను ఇరాక్ వెళతాడు అక్కడ జనులకు, తాను అమీరుల్ మూ'మినీన్ తనయుడు అని చెప్పుకుని ఉంటాడు. వారు ఇతనికి కానుకలుగా వెండి, విలువయిన సామగ్రి, నగిషి ఉన్న కరవాలం ఇత్యాదివి ఇచ్చారు'' అన్నారు. ఆసిమ్, ''నేను ఇలా ముమ్మాటికీ చేయలేదు. నేను కేవలం కొందరు ముస్లిములను కలుసుకున్నాను, అంతే. వారు ఇవన్నీ నాకు బహూకరించారు'' అని తన నిర్దోషిత్వం వెలిబుచ్చారు.

ఆ పైన మహనీయ ఉమర్ కోశాధికారిని సంబోధించి, ఈ సామానంతా బైతుల్ మాల్ (ప్రభుత్వ ఖజానా)లో జమ చేయవలసిందని పురమాయించారు. మహనీయ ఉమర్(ర) ప్రకారం, ఆ కానుకలన్నీ అతనికి అమీరుల్ మూ'మినీన్ కుమారుడు కావడం మూలాన లభించాయి, కనుక ఆ సొమ్ము అతనికి ధర్మ సమ్మతం కాదు. ప్రభుత్వాధికారులు అడగకపోయినా జనం కానుకలుగా ఇచ్చేవన్నీ ప్రభుత్వ సొమ్ము, వారి వ్యక్తిగత మీరాశి కాదు. అందుకే ఆయన తన సతీమణి ఉమ్మె కుల్సూమ్‌కు అందిన కానుకల్ని సయితం బైతుల్ మాల్‌లో జమ చేయించారు. ✤


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

'చరితార్థులు'-2



# షాహ్ ముహమ్మద్ జుబేర్
## (1888-1930)

44




**భారత** స్వాతంత్ర్యోద్యమంలో చురుకైన పాత్రను నిర్వహించిన షాహ్ ముహమ్మద్ జుబేర్ బీహార్ రాష్ట్రం గయా జిల్లాలోని ఆర్వల్‌లో 1888లో జన్మించారు. ఆయన తండ్రి షాహ్ అష్ఫాఖ్ హుస్సేన్ సంపన్న జమీందారు. ప్రాథమిక విద్య స్వగృహంలో చేసిన షాహ్ ముహమ్మద్ జుబేర్ పాట్నాలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. 1909లో ఇంగ్లాండ్ వెళ్ళి న్యాయశాస్త్రం అధ్యయనం చేసి 1911లో బారిష్టర్‌గా తిరిగి ఇండియా వచ్చి 1912లో న్యాయవాదిగా ప్రాక్టిస్ మొదలుపెట్టిన షాహ్ జుబేర్ మాంఘెరిలో స్థిరపడ్డారు. బ్రిటిష్ ప్రభుత్వ చర్యల వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ, ఇటు మంచి న్యాయవాదిగా అటు మంచి నాయకుడిగా ప్రజల మన్నన పొందారు. 1914లో న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పిన షాహ్ జుబేర్ భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలలో పాల్గొనటం ఆరంభించారు. 1919 నాటి ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో ఆయన మాంఘెరి కేంద్రంగా గయా జిల్లాలో ప్రధాన పాత్ర నిర్వహించారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా జాతీయవాదులైన విద్యార్థుల చదువుల నిమిత్తం ఏర్పడిన జాతీయ పాఠశాలల, కళాశాలల బాగోగులను పర్యవేక్షణ బాధ్యతలను భారత జాతీయ కాంగ్రెస్ బీహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి సభ్యునిగా ఆయన నిర్వహించారు. జాతీయోద్యమంలో నిర్మాణాత్మక పాత్రను నిర్వహిస్తున్న ఆయనను 1921 డిసెంబర్‌లో ఆంగ్ల ప్రభుత్వం నిర్బంధించి రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్షకు గురిచేసింది. ఆ అరెస్టులకు, నిర్బంధాలకు, నిషేధాలకు ఏమాత్రం జంకని షాహ్ జుబైర్ భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలలో మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ప్రజల పక్షంగా కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రజలతో మమేకమై సాగుతున్న ఆయన మాంఘెరి జిల్లా బోర్డు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1924, 1926లో భారత జాతీయ కాంగ్రెస్ శాఖ అయిన బీహార్ రాష్ట్ర కార్యనిర్వాహణ కమిటీ సభ్యునిగా బాధ్యతలు చేపట్టి, 1925లో బీహార్ ప్రాంతీయ కాంగ్రెస్ సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించారు. 1925లో బీహార్ – ఒరిస్సా రాష్ట్రాల కౌన్సిల్‌లో సభ్యులయ్యారు. 1927 డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగిన అఖిల భారత ముస్లింలీగ్ జాతీయ సమావేశాలకు హాజరయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్ పిలుపుమేరకు జరిగిన 'ఆల్ పార్టీస్ కన్వెన్షన్'లో ముస్లిం లీగ్ ప్రతినిధిగా షాహ్ జుబేర్ పాల్గొన్నారు. 1927లో న్యాయవాద వృత్తిని పునఃప్రారంభించిన షాహ్ జుబేర్ భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు 1930 జనవరిలో బీహార్ – ఒరిస్సా రాష్ట్రాల కౌన్సిల్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆధునిక భావాల ప్రతినిధిగా ముస్లింల ఆచార, వ్యవహారాల్లో సంస్కరణలను సూచించి ఆచరించిన షాహ్ ముహమ్మద్ జుబేర్ 1930 సెప్టెంబర్ 14న తనువు చాలించారు. ✤



9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




సార్వత్రిక ఎన్నికల మొదటి విడత పోలింగ్ ముగిసింది. మొదటి విడత పోలింగుతో పాటు ప్రజలు ఎవరి వైపు మొగ్గు చూపుతున్నారో, ఎవరిని తిరస్కరిస్తున్నారో, గాలి ఎటు వీస్తుందో చాలా మందికి అర్థమైపోయింది. ప్రధాని మోడీకి కూడా బాగానే అర్థమైంది.

పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో గతంలో అల్లర్లు జరిగాయి. ఆ తర్వాతి నుంచి అక్కడ బీజేపీ వరుసగా విజయాలు సాధిస్తూ వచ్చింది. కాని ఇప్పుడు పరిస్థితి మారింది. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో ఇప్పుడు మతపరమైన విభజన కనిపించడం లేదని, హిందూ ఓటర్లు ముస్లిం అభ్యర్థులకు, ముస్లిం ఓటర్లు హిందూ అభ్యర్థులకు తమ ఓట్లు వేశారన్న వార్తలు వచ్చాయి. పైగా ఠాకూర్లు ఆగ్రహించడంతో బీజేపీ పరిస్థితి పలచబడింది. మొదటి విడత పోలింగ్ ముగిసిన తర్వాత పరిస్థితి బీజేపీ నేతలను కలవరపెట్టినట్లు స్పష్టంగా కనబడుతోంది. ఎందుకంటే, మతపరంగా ఓటర్లను చీల్చడం జరక్కపోతే బీజేపీకి గెలిచే అవకాశాలు లేవు. అభివృద్ధి పేరుకి కూడా ఎక్కడా మోడీ పరిపాలనలో కనిపించడం లేదు. ఉద్యోగాలు లేవు. గత 45 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం ప్రబలింది. 2012లో మొత్తం నిరుద్యోగులు కోటి మంది ఉండేవారు. 2022లో ఈ సంఖ్య నాలుగు కోట్లకు పెరిగింది. గ్రాడ్యుయేట్లు పోస్టు గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగం 33 శాతం ఉంది. ప్రధాని మోడీ రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పిన గ్యారంటీ లాంటి మాట జుమ్లా మాత్రమే అని రుజువయ్యింది. అంతర్జాతీయ మార్కెటులో చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో చమురు ధరలు అత్యధికంగా పెరుగుతున్నాయి. డిమానిటైజేషన్ వల్ల అనేకమంది ఉపాధి కోల్పోయారు. ఆ తర్వాత అడ్డగోలుగా తీసుకువచ్చిన జియస్టీ వల్ల చిరువ్యాపారులు నష్టపోయారు. మొత్తం ఆర్థికవ్యవస్థ కుదేలయ్యింది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న గ్యారంటీ కూడా జుమ్లా అయ్యింది. గిట్టుబాటు ధర లభించడం లేదు. వ్యవసాయ చట్టాలపై రైతులు ఆందోళన చేయడం, ఈ ఆందోళనల్లో దాదాపు 700 మంది రైతులు మరణించడం జరిగింది. ప్రధాని ఫసల్ యోజన వల్ల ఇన్సూరెన్స్ కంపెనీలకు 3,40,000 కోట్ల రూపాయల లాభం కలిగింది కాని గంటకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడని కాంగ్రెస్ బ్లాక్ పేపరు జారీ చేసి విమర్శించింది. ప్రధాని మోడీ సాధించింది ఏదీ చెప్పుకోడానికి లేదు. ఇప్పుడు ఓట్లు సంపాదించే సాధనం మతతత్వమే, కశ్మీరులో 370 రద్దు చేశాం, రామ మందిరం నిర్మించాం వగైరా మాత్రమే బీజేపీ చేతుల్లో ఉన్నాయి. ఇప్పుడు మోడీ మ్యాజిక్ మసకబారిపోయింది. మొదటి విడత ఎన్నికల్లో ఈ సూచనలు స్పష్టంగా కనిపించాయి.

రామమందిరం కూడా ఇప్పుడు ఎన్నికల్లో బీజేపీకి ఉపయోగ

పడేలా లేదు. సియస్డియస్ సర్వే ప్రకారం హిందూత్వ ఈ ఎన్నికల్లో కేవలం 2 శాతం ఓటర్లను మాత్రమే ప్రభావితం చేస్తోంది. దేశంలో ఇప్పుడు హిందూత్వ, రామమందిరం నినాదాలతో ఓట్లు పొందే పరిస్థితి లేదు. ఇప్పుడు రెండో విడత ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకోడానికి ఏం చెప్పగలరు? చెప్పుకోడానికి చేసింది ఏదీ లేదు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మాట మరిచిపోయారు. ఉద్యోగాలు లేవు. కొన్ని ఉద్యోగాల్లో నియామకాల నోటిఫికేషన్లు వచ్చాయి కాని పేపర్లు లీక్ అయ్యాయి. ఉద్యోగాలు రాలేదు సరికదా ఉన్న ఉద్యోగాలు పోయాయి. ఇక ఇప్పుడు మతతత్వం తప్ప మరో దారి లేదు. ఇప్పటి వరకు బీజేపీ అభ్యర్థులు ఏ ఎన్నికల్లో అయినా సరే మతతత్వం వల్లనే గెలుస్తూ వచ్చారు. మతపరమైన విభేదాలు రెచ్చగొట్టడం వల్లనే గెలుస్తూ వచ్చారు. ఓటు వేయడానికి వెళితే రామ మందిరాన్ని గుర్తు చేసుకోండి... సనాతన ధర్మాన్ని కాపాడాలి.. వగైరా మాటలు ప్రచారాలు మనకు తెలిసినవే. అంటే ఉద్యోగకల్పన, ఉపాధికల్పన, విద్య, ప్రజారోగ్యం, అభివృద్ధి గురించి మాట్లాడి ఓట్లు అడిగే అవకాశమే లేదు. మరోవైపు కాంగ్రెసు న్యాయపత్రం పేరుతో మ్యానిఫెస్టో తీసుకువచ్చింది. ఇందులో ఉపాధి కల్పన, పేదరికం, రైతులకు గిట్టుబాటు ధర, ఉద్యోగాల కల్పనకు గ్యారంటి, ఏడాదికి లక్షరూపాయల జీతంతో పెయిడ్ ఇంటర్న్ షిప్పు వంటి హామీలతో ప్రజల్లో ప్రచారం చేస్తోంది. కర్నాటకలో, తెలంగాణలో ఈ గ్యారంటీలే కాంగ్రెసును గెలిపించాయి. మొదటి విడత ఎన్నికల ఎగ్జిట్ పోల్స్‌ను పరిశీలిస్తే తమిళనాడులో బీజేపీ ఖాతా కూడా తెరిచే పరిస్థితి లేదు. ఈ పరిస్థితిలో బీజేపీని గెలిపించాలంటే మతతత్వమే ఏకైక మార్గం.

రాజస్థాన్‌లో ప్రధాని మోడీ ప్రసంగాన్ని పరిశీలిస్తే ఈ నిరాశ స్పష్టంగా కనిపిస్తుంది. దేశంలో టీ.యన్.శేషన్ వంటి ఎన్నికల కమీషనర్ ఇప్పుడు ఉన్నట్లయితే నిస్సందేహంగా తీవ్రమైన నోటీసు జారీ చేసి ఉండేవారు. కాని ఇప్పుడు ఎన్నికల కమీషన్ నుంచి ఇలాంటివి ఆశించే పరిస్థితి లేదు. రాజస్థాన్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోడీ కాంగ్రెసును విమర్శించారు. కాంగ్రెస్‌ను విమర్శించకుండా ఆయన ఉండలేరు. ఎందుకంటే, పదేళ్ళ పరిపాలనా కాలంలో తాను సాధించినవి చెప్పుకోడానికి ఏమీ లేవు కాబట్టి కాంగ్రెసును విమర్శించడం తప్ప మరేదీ చేతుల్లో లేదు. పదేళ్ళ క్రితం అధికారంలో ఉన్న కాంగ్రెసు ఏం చేసిందో చెప్పే బదులు పదేళ్ళు అధికారంలో ఉన్న బీజేపీ ఏం చేసిందో చెబితే బాగుండేది. కాని ఆయన అలా చేయలేదు. కాంగ్రెసు పరిపాలనా కాలంలో ప్రధాని మన్‌మోహన్ సింగ్ చేసిన ఒక ప్రసంగాన్ని వక్రీకరించి బీజేపీ చాలా కాలంగా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రెస్ వ్యవహారాలు చూసిన పంకజ్ పచోరి మన్ మోహన్ సింగ్ ప్రసంగంలో ఏం చెప్పారో వివరాలతో సహా బీజేపీ ప్రచారాన్ని అబద్ధంగా ఎప్పుడో నిరూపించారు. దేశ వనరులపై మొదటి హక్కు ముస్లిములకు ఉందని మన్‌మోహన్ సింగ్ చెప్పినట్లు బీజేపీ ప్రచారం చేస్తోంది. మన్‌మోహన్ సింగ్ అలా చెప్పలేదని, యస్సీ, యస్టీ, ఓబీసీ, మహిళలు తదితరులందరినీ ప్రస్తావిస్తూ చేసిన ప్రసంగమని నిజనిర్ధారణలు ఎన్నోసార్లు జరిగాయి. నిజానికి 2006 నుంచి ఈ విషయమై స్పష్టమైన నిజ నిర్ధారణలున్నాయి. కాని ప్రధానికి నిజాలతో పనిలేదు. అబద్ధాలు ప్రచారం చేసి మతతత్వం రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలన్న దుగ్ధ తప్ప ఆయనలో మరేది కనిపించడం లేదు. దీంతో పాటు ఆయన మరో మాట చెప్పారు. కాంగ్రెస్ రీ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్ అంటే సంపద పంపిణీ గురించి మాట్లాడుతుందన్నారు. ఇది ఎకనామిక్స్ పరిభాష. ప్రధాని మోడీకి ఎకనామిక్స్ తెలియకపోవచ్చు. కాని ఆయన పక్కన ఉండే కార్యదర్శులకు ఈ విషయాలు తెలిసినవే. రీ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్ అంటే టాక్సేషన్ ద్వారా సంపన్నుల నుంచి అంటే దేశ సంపదలో 90 శాతం తమ గుప్పిట ఉంచుకున్న అతి స్వల్ప సంఖ్యలో ఉన్న కుబేరుల నుంచి సంపదను బయటకు తీసి సాధారణ ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చడం. ఇదేమీ బ్యాంకులను దోచుకుని పంచడం కాదు. బ్యాంకుల్లోని ఖాతాలను జప్తు చేసుకుని పంచడం కాదు. టాక్సేషన్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని సాధారణ ప్రజలకు ఊరట కలిగించే సబ్సిడీలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఉద్యోగ కల్పన కార్యక్రమాలు చేపట్టడానికి ఉపయోగించడం జరుగుతుంది. కాంగ్రెసు చెప్పిన ఈ రీ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్ అంటే సంపద పంపిణీని మోడీ వక్రీకరించి హిందువుల నుంచి లాక్కుని ముస్లిముల్లో పంచి పెడతారని అన్నారు. ఒక ప్రధాని ఈ స్థాయిలో దిగజారి ప్రసంగించడం .... అద్భుతం అని చెప్పాలా? ఈ మాటలు విన్న ప్రజలకు మణిశంకర్ అయ్యర్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. సోషల్ మీడియాలో చాలా మంది ఈ విషయాన్ని ప్రస్తావించారు. మణిశంకర్ అయ్యర్ చెప్పిన మాటలు అనుచితమే ... కాని ఒక ప్రధాని హెూదాలో మోడీ వాడుతున్న భాషను ఏమనాలి. ఆయన మంగళసూత్రాల గురించి కూడా ప్రస్తావించి, కాంగ్రెసు మహిళల మంగళ సూత్రాలను కూడా లాక్కుని పిల్లలెక్కువ కనే వారికి పంచుతుందని చెప్పారు. ఈ భాషను ఏమనాలి? కాంగ్రెసు మహిళల మంగళసూత్రాలు దోచుకోవాలని చూస్తోందా? నిజం

చెప్పాలంటే కోవిడ్ కాలంలో మహిళలు తమ మంగళసూత్రాలు కూడా అమ్ముకునే స్థితికి దేశాన్ని తీసుకెళ్ళారు ప్రధాని మోడీ. కోవిడ్‌ను ఎదుర్కోడానికి చప్పట్లు కొట్టండి, పళ్ళాలు వాయించండి వంటి చిట్కాలు చెప్పారు. ఈ కాలంలోనే అదానీ, అంబానీల సంపద మరింత పెరిగింది. మరోవైపు ప్రజలు ఉపాధి కోల్పోయారు. కార్మికులు కాలినడకన స్వంత ఊళ్ళకు రక్తసిక్త పాదాలతో నడిచారు. టీచర్లు కూరగాయలు బండిపై పెట్టుకుని అమ్మిన వార్తలు వచ్చాయి. ఈ కాలంలో మహిళలు మంగళ సూత్రాలు అమ్మి పిల్లల ఆకలి తీర్చవలసి వచ్చింది. మహిళల మంగళ సూత్రాలు లాక్కోవడం ఎవరు చేశారు? అలాగే రైళ్ళలో వయోధికులకు టిక్కెట్టు ధరలో తగ్గింపు ఉండేది. కోవిడ్ సాకుతో దాన్ని రద్దు చేశారు. మళ్ళీ ప్రవేశపెట్టలేదు. ముసలివారి సదుపాయాలను దోచుకునే పని ఎవరు చేశారు? ఈ ప్రసంగంలో ప్రధాని మోడీ ముస్లిములను సూచిస్తూ చొరబాటుదారులన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరసైనికుడు అబ్దుల్ హమీద్ కూడా ముస్లిమే. దేశానికి క్షిపణుల బలాన్నిచ్చిన అబ్దుల్ కలామ్ కూడా ముస్లిమే. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాన్నిచ్చిన హస్రత్ మొహానీ ముస్లిమే. దేశ స్వతంత్ర పోరాటంలో మౌలానా అబుల్ కలామ్ పాత్రను ఎవరు మరిచిపోగలరు. ఆయన ముస్లిమే. దేశం కోసం నవ్వుతూ ప్రాణాలిచ్చిన అష్ఫాఖుల్లా ఖాన్ ముస్లిమే. సైన్యంలో ఎంత మంది ముస్లిములు సేవలందిస్తున్నారు... దాద్రిలో అఖ్లాక్‌ను గొడ్డుమాంసం సాకుతో చంపేసిన వాళ్ళు ఏ భావజాలం కలిగిన వారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అఖ్లాక్ కుటుంబంలో ఒకరు మన ఎయిర్ ఫోర్సులో సేవలందిస్తున్నారు. ప్రధాని మోడీని సమర్థించడానికి ఏమైనా చేస్తానంటూ టీవీ తెరపై చెప్పుకున్న రుబికా లియాకత్ కూడా ముస్లిమే. బీజేపీలో ఉన్న ముఖ్తార్ అబ్బాస్ నక్వీ వంటి నేతలు కూడా ముస్లిములే....వీళ్ళంతా చొరబాటు దారులా? ఇది స్పష్టంగా ఇస్లామోఫోబియా.

హిందువుల నుంచి సంపద లాక్కుని పిల్లలు ఎక్కువ కనే వారికి పంచిపెడతారని మోదీ చెప్పిన మాటల్లో విద్వేష విషం ఎవరినైనా భయపెడుతుంది. దేశంలో జనాభా పెరుగుదలను పరిశీలిస్తే 1951 నుంచి 2011 వరకు మాత్రమే మన వద్ద డాటా ఉంది. ఈ డాటా ప్రకారం ముస్లిముల సంఖ్య 13 కోట్ల 60 లక్షలు పెరిగితే హిందువుల సంఖ్య 67 కోట్ల 60 లక్షలు పెరిగింది.

ప్రధాని మోడీకి ఇలాంటి మాటలు చెప్పవలసిన అవసరమేమొచ్చింది? పదేళ్ళ పరిపాలనలో ఉద్యోగాలు కల్పించి ఉంటే, ఉపాధి అవకాశాలు కల్పించి ఉంటే, రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి వారి ఆదాయం పెంచి ఉంటే, ప్రజలకు నివాసగృహాలు కల్పించి ఉంటే ఈరోజు ఇలాంటి మాటలు చెప్పి మతతత్వంపై ఆధారపడే పరిస్థితి ఉండేది కాదు. నోట్లరద్దు చేసి ప్రజలను క్యూలో నిలబెట్టారు. కోవిడ్ కాలంలో ప్రజలను ఆదుకున్నది లేదు. పైగా కోవిడ్ జిహాద్ పేరుతో తబ్లీగ్ జమాఅత్ సాకుతో ముస్లిములపై విషం కక్కే ప్రచారం చేశారు. వందలాది కిలోమీటర్లు కాలినడకన కార్మికులు నడిచి వెళ్ళిన దృశ్యాలు, గంగా నది ఒడ్డున శవదహనాల దృశ్యాలు దేశం మరిచిపోలేదు. ఆసుపత్రుల్లో వైద్యం దొరకలేదు. ఆక్సిజన్ దొరకలేదు. ఏవో ప్యాకేజీలు ప్రకటించారు. ఏ ప్యాకేజ్ ఎవరికి అందిందో ఎవరికీ తెలియదు. గోరక్‌పూర్ ఆసుపత్రిలో పిల్లలను ఆదుకోడానికి తన సర్వస్వం ఒడ్డి ప్రయత్నించిన డాక్టర్ ముస్లిమ్ అయినందువల్ల అతనిపై కక్షసాధింపు చర్యలు చేపట్టారు.

దేశానికి చేసింది ఏదీ లేదు. పైగా దేశం కోసం పనిచేస్తున్న వారిని ఇబ్బందుల పాలు చేసిన తర్వాత ఇప్పుడు ప్రజల ముందుకు వచ్చి చెప్పుకోడానికి కూడా ఏదీ మిగల్లేదు. అందుకే విద్వేష రాజకీయాలు రాజేస్తున్నారు.

ఏది ఏమైనా ప్రధాని చేసిన ప్రసంగం గమనిస్తే మనకు కొన్ని విషయాలు స్పష్టంగా అర్థమవుతున్నాయి. మొదటిది. ఈసారి 400 కన్నా ఎక్కువ సీట్లు అన్నది కేవలం నినాదమే తప్ప వాస్తవం అయ్యే సూచనలు లేవు. అందుకే ఇప్పుడు విద్వేషం రాజేసి పని కానిచ్చే పనిలో ఉన్నారు. ఎందుకంటే, బీజేపీకి ఎల్లప్పుడు ఉపయోగపడుతూ వచ్చిన ఫార్మూలా ఇదే. రెండవది.. ప్రజలను మభ్యపుచ్చి మాయ చేసే ప్రయత్నం జరుగుతుంది. అసలు సమస్యలపై ప్రజలు ఆలోచించకుండా చేసే ప్రయత్నం ఇది. ఈ మాయలో ప్రజలు పడతారా లేదా అన్నది జూన్ 4 తర్వాతనే తెలుస్తుంది. మూడవ విషయం... దేశంలో ఎన్నికల కమీషన్ ఇప్పుడు రబ్బరు స్టాంపు మాదిరిగా పనిచేస్తోంది. మతం పేరుతో ఓట్లు అడగడం, ప్రజలను రెచ్చగొట్టడం, ఎవరి మతాన్నయినా ఎన్నికల సభల్లో విమర్శించడం ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చట్టవిరుద్ధం. అయినా సరే ఎలాంటి చర్యలు ఉండవు. ఎందుకంటే ఎన్నికల కమీషన్ చర్యలు తీసుకోదు. నాల్గవ విషయం... మోడీ సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని చెప్పింది కేవలం జుమ్లా. ఆయన అసలు నైపుణ్యం మతవిద్వేషం రాజేయడం. ఇప్పటి వరకు ఇందులో ఆయన తిరుగులేని విజయాలు సాధిస్తూ వచ్చారు. 2024లో ఏమవుతుందో వేచి చూద్దాం.




- ఆయెషా తస్లీం

పవిత్ర రమజాన్ మాసం ముగిసింది. రమజానులో ముస్లిములు ఆధ్యాత్మిక శిక్షణతో పునరుత్తేజం పొందారు. రమజాన్ మాసం ప్రాముఖ్యత ఏమిటంటే, ఈ మాసంలోనే పవిత్ర గ్రంథం దివ్య ఖుర్‌ఆన్ దేవుని తరపున భూమిపైకి వచ్చింది. మానవాళికి మార్గదర్శనం ఉన్న దివ్య గ్రంథాన్ని అల్లాహ్ అందించాడు కాబట్టి కృతజ్ఞతగా ఉపవాసాలు పాటిస్తారు. ఈ సందర్భంగా మనం దివ్య ఖుర్‌ఆన్ గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం.

అమెరికా ఎన్నికల్లో, మిచిగన్ నుంచి గెలుపొందినప్పుడు డెమొక్రాట్ అభ్యర్థి రాషిదా లాయిబ్ దివ్య ఖుర్‌ఆన్ పై ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఆమె ఏదో ఒక దివ్యఖుర్‌ఆన్ కాపీపై ప్రమాణం చేయలేదు. అమెరికా అధ్యక్షుల్లో ఒకరైన జఫర్సన్ వ్యక్తిగత దివ్య ఖుర్‌ఆన్ కాపీ, 1734 కాలం నాటి దివ్య ఖుర్‌ఆన్ కాపీపై ప్రమాణ స్వీకారం చేస్తానన్నారు. ఆ ప్రతి కాంగ్రెస్ లైబ్రరీలో పదిలంగా ఉంది. ఆమె కోసం ఆ ఖుర్‌ఆన్ ప్రతిని తీసుకు వచ్చారు. ఈ అతి పాత ఖుర్‌ఆన్ ప్రతిపై ప్రమాణం చేయడానికి కారణం, అమెరికా ఏర్పాటి నప్పటినుంచి ముస్లిములు అమెరికాలో భాగంగా ఉన్నారని చెప్పాలన్నదే ఆమె ఉద్దేశ్యం.

బాలీవుడ్ నటి, మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ గతంలో షార్జాలో ఒక కార్యక్రమంలో మాట్లాడుతున్నప్పుడు ఆమెను భారత పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మీ సందేశమే మిటని అడిగినప్పుడు ఆమె దివ్యఖుర్‌ఆన్‌లోని సూరా అస్ర్ అధ్యాయాన్ని చదివి, దాని అనువాదం కూడా వినిపించారు. అంతకు ముందు కూడా రమదాన్ మాసం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నప్పుడు కూడా దివ్యఖుర్‌ఆన్‌లోని సూరా అస్ర్ ఆమె వినిపించారు. ఈ అధ్యాయం అనువాద మేమిటంటే- "కాలం సాక్షిగా! నిస్సందేహంగా మానవుడు పెద్ద నష్టానికి గురిఅయి ఉన్నాడు. విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉండేవారూ, ఒకరికొకరు సత్యోపదేశం, సహన బోధ చేసుకునే వారూ తప్ప". ఇందులో ప్రధానమైన ఉపదేశం, సహనం వహించడం, ఒకరికొకరు సత్యం గురించి చెప్పుకోవడం. ఇది ఒక మంచి సమాజాన్ని నిర్మించే గొప్ప ఆచరణల్లో ఒకటి.

దివ్య ఖుర్‌ఆన్ ముస్లిముల పవిత్ర గ్రంథం అని అందరూ భావిస్తారు. కాని ఏ ముస్లిమును అడిగినా దివ్యఖుర్‌ఆన్ తమకు మాత్రమే పరిమితమైన పవిత్రగ్రంథం అని చెప్పడు. దివ్య ఖుర్‌ఆన్ సమస్త మానవాళికి చెందిన గ్రంథమనే అంటాడు. చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్(స)ద్వారా ఈ పవిత్ర గ్రంథాన్ని అల్లాహ్, అంటే దేవుడు మానవాళికి పంపించాడు. మానవాళి మార్గదర్శనం కోసం పంపించాడు. దివ్యఖుర్‌ఆన్ ప్రభావమేమిటి? సహనం, సత్యోపదేశాల ప్రాముఖ్యమేమిటన్నది మరో సంఘటన ద్వారా కూడా మనం తెలుసుకోవచ్చు.

ప్రవక్త ముహమ్మద్ (స) మక్కానగరంలో ఇస్లాం ప్రచారం చేస్తున్న ప్రారంభకాలంలో ఆయన్ను చాలా మంది వ్యతిరేకించారు. చాలా మంది ఆయనపై ఆగ్రహంతో కత్తులు నూరేవారు. హజ్రత్ ఉమర్ (రజి) కూడా అలాంటి వారిలో ఒకరు. తాతముత్తాతల సంప్రదాయాలను, మతాన్ని, దేవీదేవతలను అందరిని ప్రవక్త ముహమ్మద్ (స) కాదంటున్నారని, తిరస్కరిస్తున్నారని ఆయనకు కోపం. ఒకరోజు ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేయాలని, ప్రవక్త ముహమ్మద్ (స) పై దాడి చేయాలని హజ్రత్ ఉమర్ (రజి) చేత కరవాలం పట్టుకుని ఆగ్రహంగా ప్రవక్త ముహమ్మద్ (స) నివాసం వైపు బయలుదేరారు. దారిలో ఆయనకు మిత్రుడు ఒకరు కనిపించారు. హజ్రత్ ఉమర్ (రజి) వాలకం చూసి అనుమానించిన ఆయన ఎక్కడికి అంత కోపంగా వెళుతున్నారని అడిగారు. హజ్రత్ ఉమర్ (రజి) జవాబిస్తూ, ఈ రోజుతో ప్రవక్త ముహమ్మద్ (స) సమస్య పూర్తిగా పరిష్కారం చేసేస్తా అన్నారు. ఇది విన్న ఆ మిత్రుడు, "ప్రవక్త ముహమ్మద్ (స) సంగతి తర్వాత, ముందు మీ కుటుంబ విషయం చూడండి. మీ చెల్లెలు బావ కూడా ఇస్లాం తీసుకుని ముస్లిములై పోయారు తెలుసా" అన్నారు. ఈ మాటలు వినగానే హజ్రత్ ఉమర్ (రజి) కోపంతో ఊగిపోతు చెల్లెలి ఇంటికి వెళ్ళారు. అప్పుడు చెల్లెలు, బావ ఇంట్లో దివ్య ఖుర్‌ఆన్ చదువుకుంటున్నారు. ఈయన రావడం చూసి దివ్య ఖుర్‌ఆన్ పత్రాలు దాచేశారు. కాని అప్పటికే అనుమానించిన ఉమర్ (రజి), వారిద్దరు పూర్వీకుల మతాన్ని వదిలి భ్రష్టులైపోయా రని కోపంతో, వారిద్దరిని నిర్దయగా కొట్టారు. ఆయనెంత కొట్టినా చెల్లెలు ఇస్లాం నుంచి వైదొలిగేది లేదన్నారు. రక్తం కారుతున్న చెల్లెలిని చూసి ఉమర్ (రజి) కాస్త శాంతించారు. సరే మీరు చదువుతున్నదేమిటో నాకు చూపించండి అన్నారు. కాళ్ళు చేతులు కడుక్కుని పరిశుభ్రంగా వస్తే ఇస్తానని చెల్లెలు చెప్పారు. ఉమర్ (రజి) అలాగే చేశారు. దివ్యఖుర్‌ఆన్‌లోని సూరే తాహా అధ్యాయంలోని వాక్యాలు.. "మేము ఈ ఖుర్‌ఆన్‌ను నీపై అవతరింపజేసింది నిన్ను కష్టానికి గురిచేయటానికి మాత్రం కాదు. ఇది (దేవునికి) భయపడే ప్రతి వ్యక్తికీ ఒక జ్ఞాపిక. భూమినీ,

ఎత్తైన ఆకాశాలనూ సృష్టించిన వాని తరపు నుండి ఇది అవతరింప జేయబడింది.'' ఈ వాక్యాలు చదివిన తర్వాత ఉమర్ (రజి) ఆలోచనలో పడ్డారు. వెంటనే ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు వెళ్ళి ఇస్లాం స్వీకరించారు.

దివ్య ఖుర్‌ఆన్‌లో ఏముంది? ఈ ప్రశ్నకు జవాబు దివ్య ఖుర్‌ఆన్‌లో మనిషి జీవితం ఉంది. దివ్యఖుర్‌ఆన్ మనిషి గురించి మాట్లాడుతుంది. మనిషి జీవించ వలసిన పద్ధతి గురించి మాట్లాడుతుంది. సన్మార్గం గురించి చెబుతుంది. దివ్య ఖుర్‌ఆన్ దశలవారీగా ప్రవక్త ముహమ్మద్(స) వద్దకు వచ్చింది. ఖుర్‌ఆన్ అంటే అర్థం, ''చదివే పుస్తకం''. ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు వచ్చిన మొట్టమొదటి వాక్యం ''చదువు'' అనే పదంతోనే ప్రారంభమవుతుంది. సూరా అలఖ్ అధ్యాయంలో ఈ వాక్యం అనువాదం.. 'చదువు సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో...' ఈ వాక్యంతోనే దివ్యఖుర్‌ఆన్ మానవాళి వద్దకు రావడం ప్రారంభమైంది. మొదటి వాక్యమే మనిషికి చదువు ప్రాముఖ్యాన్ని చాటి చెప్పింది. ఆ తర్వాత 23 సంవత్సరాల కాలంలో వివిధ దశలుగా దివ్యఖుర్‌ఆన్ గ్రంథాన్ని అల్లాహ్ మానవాళి కోసం పంపించాడు. ఇందులో మొత్తం 114 అధ్యాయాలున్నాయి. ఒక్కో అధ్యాయాన్ని సూరా అంటారు. కొన్ని సూరాలు చాలా పెద్దవి. కొన్ని చాలా చిన్నవి.

దివ్యఖుర్‌ఆన్ ప్రవక్త ముహమ్మద్ (స) రచన కానే కాదు. దివ్యఖుర్‌ఆన్ అల్లాహ్ వాక్కు. అల్లాహ్ పంపించిన వాక్యాలను ప్రవక్త ముహమ్మద్ (స) ప్రజలకు వినిపించారు. నేటికి 1400 సంవత్సరాల పూర్వం, చిట్టచివరి ప్రవక్తగా ముహమ్మద్ (స)ను ఎన్నుకున్న అల్లాహ్ ఆయన ద్వారా ఈ దివ్యగ్రంథాన్ని మానవాళికి అందించాడు. ఈ పద్నాలుగు వందల సంవత్సరాల కాలంలో ఈ గ్రంథంలోని ఒక్క అక్షరం కూడా మార్పు చెందలేదు. ఎలాంటి దలాగే భద్రంగా ఉంది. దీనికి కారణమేమిటంటే, దివ్య ఖుర్‌ఆన్ రక్షణ బాధ్యత స్వయంగా అల్లాహ్ తానే తీసుకున్నాడు. దివ్య ఖుర్‌ఆన్‌లోనే ఈ విషయాన్ని ప్రకటించాడు.

''ఇక ఈ జ్ఞాపిక (ఖుర్‌ఆన్), దానిని మేము అవతరింపజేశాము. స్వయంగా మేమే దానిని రక్షిస్తాము''. (దివ్యఖుర్‌ఆన్ 15:9)

దివ్య ఖుర్‌ఆన్ ఏం చెబుతుందంటే, మనిషికి రుజుమార్గం ఏమిటో చూపిస్తుంది. జీవితం ఎలా గడపాలో తెలియజేస్తుంది. మార్గదర్శనమిస్తుంది. ఇది కేవలం ముస్లిముల గ్రంథం కాదు. యావత్తు మానవాళిని ఉద్దేశించి మాట్లాడుతుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విషయాన్ని అల్లాహ్ స్వయంగా ఇలా తెలియజేశాడు:

''ఇది అల్లాహ్ గ్రంథము. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. అల్లాహ్ భీతి కలవారికి ఈ గ్రంథం మార్గదర్శకం..''

(దివ్య ఖుర్‌ఆన్ 2:2)

ఖుర్‌ఆన్ డైరెక్టుగా పాఠకుడితో మాట్లాడుతుంది. మధ్యవర్తులు, మరొకరు ఎవ్వరూ మధ్యలో ఉండరు. ఖుర్‌ఆన్ మనిషికి దేవునికి మధ్య సంబంధం వంటిది. మనిషి ఎక్కడి నుంచి వచ్చాడు? భూమిపైకి ఎందుకు వచ్చాడు? మనిషి జీవితలక్ష్యం ఏమిటి? పుట్టడం, సంపాదించడం, కాలాన్ని గడిపి చనిపోవడం .. ఇంతేనా ... మనిషి జీవిత గమ్యం ఏమిటి? ప్రపంచంలో ఇన్ని కష్టాలు ఎందుకున్నాయి? మనిషి మరణించిన తర్వాత ఏమవుతుంది? ఇలాంటి అనేక ప్రశ్నలకు దివ్యఖుర్‌ఆన్ జవాబిస్తుంది. ఈ ప్రశ్నలకు గతంలో అనేకమంది తత్వవేత్తలు కూడా జవాబులు ఇచ్చారు. కాని దివ్యఖుర్‌ఆన్ అత్యంత స్పష్టంగా, సరళంగా, తాత్విక అయోమయాలు లేకుండా జవాబులు ఇచ్చింది. మానవ చరిత్ర నుంచి సంఘటనలను ప్రస్తావించి బోధిస్తుంది. ఇహ లోకంలో, ఈ ప్రపంచంలో జీవితం చాలా చిన్నదని, సాపేక్షంగా చూస్తే ఈ జీవితం అత్యంత అల్పమైనదని, అసలు జీవితం పరలోకంలో ఉందని, అది శాశ్వతమైనదని, కాని మనిషి ఆ శాశ్వత జీవితంలో విజయం సాధించాలంటే ఇక్కడ దేవునికి భయపడుతూ చెడులకు దూరంగా బతకాలని, చేసిన ప్రతి పనికి పరలోకంలో దేవుని ముందు జవాబు చెప్పుకోవలసి ఉంటుందని, పాపాలకు శిక్ష, సత్కార్యాలకు బహుమతి అక్కడ లభిస్తాయని దివ్యఖుర్‌ఆన్ బోధిస్తుంది.

మతం ఒక విశ్వాసం, దేవుడు ఒక విశ్వాసం.. విశ్వాసానికి హేతుబద్ధమైన పునాదులుండవు. కాని ఇస్లాం మాత్రం విశ్వం లోను, ప్రకృతిలోను పరిశీలించాలని ప్రోత్సహిస్తుంది. ఈ పరిశీలనలో కనబడే వివిధ సూచనలు, నిదర్శనాలపై ఆలోచించాలని, హేతుబద్ధమైన తర్కంతో విశ్వసించాలని చెబుతుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో తరచూ కనిపించే వాక్యాలు; ''మీరు ఆలోచించరా?'', ''మీరు చూడడం లేదా'' ఈ విషయాన్నే మనకు చెబుతున్నాయి. హేతుబద్ధమైన ఆలోచనతో విశ్వసించాలని చెప్పే దివ్యగ్రంథం ఖుర్‌ఆన్.

సైన్సుకు మతగ్రంథాలకు చుక్కెదురని చాలా మంది అనుకుంటారు. కాని ఆధునిక సైన్సులోని చాలా విషయాలను ఖుర్‌ఆన్ ధృవీకరిస్తోంది. మనిషి పిండం పరిణామక్రమం గురించి గాని, తోకచుక్కలు, భూగర్భశాస్త్రం, ఖగోళశాస్త్రం, లెక్కలు ఇలా అనేక శాస్త్ర సంబంధ విషయాలు ఇందులో కనబడతాయి. పద్నాలుగు వందల సంవత్సరాల క్రితం ఖుర్‌ఆన్ చెప్పిన విషయాలు నేడు అత్యాధునిక విజ్ఞాన సాంకేతిక శాస్త్ర ప్రగతి తర్వాత రుజువు కావడం కూడా దేవుని సూచనల్లో ఒకటి. అలాంటి శాస్త్రపరమైన విషయాల్లో మనిషి పిండం పరిణామ క్రమం గురించి దివ్య ఖుర్‌ఆన్ చెప్పిన దశలను చాలా మంది శాస్త్రవేత్తలు ఆశ్చర్య పోయారు. వైద్య శాస్త్రంలో పేరు ప్రతిష్ఠలు పొందిన ప్రముఖ డాక్టరు, ప్రొఫెసర్ కీత్ మూర్ ఇస్లాం స్వీకరించడానికి కారణమిదే.

**మిగతా 34వ పేజీలో...**

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

89 ఆయత్‌లు

# 43. అజ్ జుఖ్రుఫ్

10-12 ఆయనే కదా మీకొరకు భూమిని ఊయలగా చేశాడు.[7] ఇందులో మీ కోసమని బాటలు రూపొందించాడు,[8] మీరు మీ గమ్యాన్ని చేరే దారిని పొందాలని.[9]ఆయన ఒక ప్రత్యేక పరిమాణంలో ఆకాశం నుండి నీటిని దింపాడు.[10] దాని ద్వారా చచ్చిన నేలను బ్రతికించి లేపాడు, ఇదేవిధంగా ఒకరోజున మీరూ నేల నుండి వెలికి తీయబడతారు.[11] ఆయనే ఈ సమస్త జతలను సృజించాడు, మీ కొరకు పడవలను, పశువులను వాహనాలుగా చేశాడు,

9. ఈ వాక్యం ఒకేసారి రెండు అర్థాలను స్ఫురింపజేస్తుంది. ఒక అర్థం, మీరు ఈ ప్రకృతి మార్గాలు, ఈ మార్గ చిహ్నాల సహాయంతో తమ దారి కనుగొనగలగాలని, మీరు చేరదలచుకున్న స్థానానికి చేరగలగాలని అన్నది. రెండవ అర్థం, మహా మహిమాన్వితుడు అయిన అల్లాహ్ కార్య నైపుణిని చూసి మీరు మార్గబోధన పొందగలగాలి, అసలు వాస్తవికతను కనుగొనగలగాలి, ఇంకా భువిలో ఈ ఏర్పాట్లు అల్లాటప్పాగా చేయలేదనీ అర్థం చేసుకోగలగాలి. మరేమో అనేక దేవుళ్ళు కలసీ ఈ ఏర్పాటు చేయలేదని, ఒకే విజ్ఞుడయిన ప్రభువు తన సృష్టి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొండలు, మైదానాలలో ఈ దారులు ఏర్పరిచాడని, భూమిలోని ఒక్కొక్క మండలానికి అనేక విధాలుగా వేరయిన ఒక రూపం ప్రసాదించాడని, దాని మూలంగా మనిషి ప్రతి మండలాన్ని మరో మండలంతో వేరుచేసి ప్రత్యేకించగలడనీ తెలుసుకోవాలన్నది.

10. అంటే, ప్రతి ప్రాంతానికి వర్షం కురిసే సగటు పరిమాణం నిర్ణయించాడు. అది సుదీర్ఘ కాలం వరకు యేటేటా ఒక సమాన స్థాయిలో సాగుతూ ఉంటుంది. అందులో అక్రమత ఏదీ లేదు, ఒక్కో సంవత్సరం రెండంగుళాల వర్షం కురిస్తే మరో సంవత్సరం రెండు వందల అంగుళాల వర్షం కురవడం అంటూ జరగదు. ఇంకా ఆయన దాన్ని విభిన్న కాలాల్లో విభిన్న సమయాల్లో, విభిన్న ప్రదేశాల్లో విస్తరింపజేసి కురిపిస్తాడు. అది సాధారణంగా విస్తృత పరిమాణంలో భూమి పండటానికి ప్రయోజనకరమవుతుంది. అలాగే భూమిలోని కొన్ని ప్రాంతాలను వర్షం రీత్యా దాదాపు ఉపేక్షించి నీటి చుక్కాలేని, గడ్డిపరకా మొలవని ఎడారిగా రూపొందించడం కూడా ఆయన విజ్ఞతలోని విషయమే. కొన్ని ప్రాంతాలలో ఆయన ఎప్పుడయినా కరువును ఆవహింపజేస్తాడు, మరొక్కప్పుడు తీవ్రమయిన గాలివానలు పంపుతాడు. తద్వారా మనిషి, నివాస యోగ్యమయిన ప్రాంతాలలో వర్షం కురియడం, అందులో సాధారణతః క్రమబద్ధత ఎంత గొప్ప వరప్రసాదమో తెలుసుకోగలగాలన్నది ఉద్దేశం. ఈ వ్యవస్థపైన ఒక శక్తి అదుపు నియంత్రణ కలిగి ఉందని, ఆ శక్తి నిర్ణయాల సమక్షంలో ఎవరూ ఏమీ చేయలేరని మనిషి గుర్తుంచుకోవాలన్నది కూడా దీని ఉద్దేశ్యమే. ఒకదేశంలో వర్షపు సాధారణ సగటును మార్చగలగటానికి లేదా సువిశాల భూభాగాలలో ఆయన నియమించిన పంపిణీలో వ్యత్యాసం కలగజేయడానికి, లేదా వచ్చే తుఫానును ఆపగలగటానికీ, లేదా అలిగిపోతున్న మేఘాలను బుజ్జగించి తన దేశం వైపునకు రప్పించడానికీ, వాటిని వర్షించేలా చేయడానికీ ఎవరిలోనూ ఎటువంటి శక్తీ లేదు. (మరిన్ని వివరాలకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం.4, అల్ హిజ్ర్ : ఆయత్: 21 సం.5, అల్ మూ'మినూన్ : ఆయత్ : 18)

11. ఇక్కడ నీటిద్వారా భూమిలో హరితం పుట్టడాన్ని ఒకేసారి రెండు విషయాలకు ఆధారంగా పరిగణించడం జరిగింది. ఒకటి, ఈ కార్యకలాపాలన్నీ ఒక్కడే అయిన దైవం సృష్టి సామర్థ్యం, ఆయన విజ్ఞత ద్వారా జరుగుతున్నాయి మరొకరెవరూ ఈ దైవకార్యంలో ఆయనకు సహవర్తుడు లేడు అనడానికి ఆధారం. రెండవది మరణానంతరం తిరిగి జీవితం సాధ్యమే, అది సంభవించి తీరుతుంది అనడానికి కూడా ఆధారం. (మరిన్ని వివరాలకు, చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం.4, అన్ నహ్ల్ : పాద సూచి 53; సం.5, అల్ హజ్జ్ : ఆయత్ :5; అన్ నమ్ల్ : పాద సూచి 73 సం.6, అర్ రూమ్ : పాద సూచికలు 25, 34, 35 ఫాతిర్: పాద సూచి 19 సం.7, యాసీన్ : పాద సూచి 29).

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా(ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

## 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

**449)** ఖైస్ బిన్ ఉబాద్ తెలిపారు: నేను మస్జిదె నబవీలో కూర్చుని ఉండగా ఒక పెద్ద మనిషి మస్జిద్‌లోనికి వచ్చారు. ఆయన ముఖారవిందంపై అణకువ, భయభక్తుల చిహ్నాలు ఉట్టి పడుతున్నాయి. 'ఈ పెద్దాయన స్వర్గవాసి' అని జనులు చెప్పారు. ఆ పెద్దాయన రెండు రకతుల నమాజ్‌ని క్లుప్తంగా చేసుకుని బయటికి వెళ్ళిపోయారు. నేను కూడా ఆయన వెనుకే నడిచాను. 'అయ్యా! మీరు మస్జిద్‌లో ప్రవేశించగానే ఈయన గారు స్వర్గవాసి అని జనులు చెప్పుకున్నారు (ఏమిటి విశేషం?)' అని అడిగాను. దానికి ఆయన, "దైవసాక్షి! ఒకరి గురించి తనకు తెలియనప్పుడు ఈ విధంగా అనటం సమంజసం కాదు. ఎందుకంటారా, నేను మీకు చెబుతాను. దైవప్రవక్త(స) జీవిత కాలంలో నేను ఒక కల గన్నాను. ఆ కల గురించి దైవప్రవక్త (స)కు చెప్పాను. కలలో నేను ఏం చూశానంటే, నేనొక ఉద్యానవనంలో ఉన్నాను- తరువాత ఆయన ఆ ఉద్యానవనం వైశాల్యం గురించి, దాని పచ్చదనం గురించి ప్రస్తావించారు- ఆ ఉద్యానవనం మధ్యలో ఒక ఇనుప స్తంభం ఉంది. దాని అడుగు భాగం నేలలో పాతుకుని ఉంది, పైభాగం ఆకాశాన్నంటుకుంటోంది. దాని శిఖరాగ్రాన ఒక దట్టమైన వృక్షం ఉంది. 'దానిపైకి ఎక్కు' అని నాతో అనబడింది. నాలో అంతటి శక్తి లేదని అన్నాను. అంతలో ఒక సేవకుడు వచ్చి, వెనుక నుండి నా వస్త్రం ఎత్తి పట్టుకున్నాడు, అప్పుడు నేను ఆ స్తంభం పైకెక్కి, దట్టమైన ఆ వృక్షాన్ని పట్టుకున్నాను. వృక్షాన్ని బాగా గట్టిగా పట్టుకో అని నాతో అనబడింది. దానిని నేను పట్టుకుని ఉండగానే మెలకువ వచ్చేసింది- ఈ కల గురించి నేను దైవప్రవక్త(స)తో చెప్పినప్పుడు, "నీవు చూసిన ఆ వృక్షం ఇస్లామ్. అందులో ఉన్న ఆ స్తంభం ఇస్లామ్ స్తంభం. దట్టమైన వృక్షం 'ఉర్వతుల్ వస్ఖా'. అందువల్ల నీవు మరణం వచ్చేవరకూ ఇస్లామ్ ధర్మంపై స్థిరంగా ఉంటావు" అని ఆయన(స) వివరించారు. ఆ మహనీయుడు అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి).

### అధ్యాయం : 52


### హజ్రత్ ఖదీజా(ర.అ)తో దైవప్రవక్త(స) వివాహం. ఆమె[1] విశిష్టత

**451)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అలీ(రజి) ఉల్లేఖించారు: (తన కాలంలో) హజ్రత్ మర్యమ్-అలైహస్సలాం-అందరికన్నా ఉత్తమురాలైన మహిళ. కాగా, (ఈ సముదాయంలో) హజ్రత్ ఖదీజా(ర.అ) అందరికన్నా ఉత్తమురాలు."

**452)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: నాకు హజ్రత్ ఖదీజా (ర.అ)పై కలిగినంత ఈర్ష్య (రష్క్) దైవప్రవక్త(స) గారి మరే భార్యపైనా కలిగేది కాదు. వాస్తవానికి ఆమె నా వివాహానికి ముందే మరణించారు. కాని దైవప్రవక్త(స) తరచూ ఆమెను మెచ్చుకుంటూ మాట్లాడేవారు. ఆమెకు స్వర్గంలో ముత్యాలతో నిర్మించబడిన మేడ లభిస్తుందన్న శుభవార్తను వినిపించమని అల్లాహ్ తన సందేశ హరునికి ఆజ్ఞాపించాడు. దైవప్రవక్త(స) ఎప్పుడయినా మేకను జిబహ్ చేస్తే, ఆమెతో కలసిమెలసి ఉండే మహిళలకు కూడా చాలినంత మాంసం పంపించేవారు.

52-1. ఖదీజా బిన్తె ఖువైలిద్(రజిఅల్లాహు అన్హా).. దైవ ప్రవక్త(స)తో ఈమె వివాహం జరిగే నాటికి, ఈమె 40 ఏళ్ళ వితంతువు. వివాహం తరువాత మరో 25 ఏండ్లు జీవించారు. దైవప్రవక్త(స)తో ఆమె దాంపత్య జీవితం అన్యోన్యమైనది. మహా ప్రవక్త(స) నిజమైన సహధర్మచారిణిగా, సలహాదారుగా నిరూపించుకున్నారు. కష్టకాలంలో తోడూ నీడగా వెన్నంటి ఉన్నారు. దైవప్రవక్త(స)కు ఈమె ద్వారా సంతాన భాగ్యం ప్రాప్తించింది. హజ్రత్‌కు నాలుగేళ్ళ క్రితం 65 ఏండ్ల వయసులో చనిపోయారు. ఆమె వియోగంపై దైవప్రవక్త(స) ఎంతో దుఃఖావేదనకు లోనయ్యారు. ఆ సంవత్సరాన్ని శోక సంవత్సరంగా పాటించారు. ఆమెలోని మంచితనాన్ని దైవప్రవక్త(స) జీవితాంతం తలచుకునేవారు. ఎప్పుడయినా ఆమె స్నేహితురాండ్రు మదీనా వస్తే వారికి మర్యాద చేసి పంపేవారు.

★★★




**నేను ఎక్కడ నుండి వచ్చాను? నేను ఇక్కడ ఎందుకు ఉన్నాను? మరణం తర్వాత నేను ఎక్కడికి వెళ్తాను?**

మన ఉనికి, జీవిత ఉద్దేశ్యం గురించి ఆలోచిస్తున్నప్పుడు గుర్తుకు వచ్చే మొదటి ప్రశ్నలలో ఒకటి: ''మనం ఎక్కడ నుండి వచ్చాము?'' అన్నది.

యాదృచ్ఛిక సంఘటన, మహా విస్ఫోటనం ద్వారా మనం సృష్టించ బడ్డామా? లేక యుక్తిపరుడైన సృష్టికర్త ఆజ్ఞతోనా? నిజ సృష్టికర్త ఉనికిని గుర్తించడం అనేది జీవితంలో మన ఉనికి ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోవడానికి మొదటి మెట్టు. సృష్టికర్త ఉనికి తెలియజేసే అనేక హేతుబద్ధమైన కారణాలు ఉన్నాయి. వాటిలో మూడింటిని క్లుప్తంగా పేర్కొంటున్నాము.

## 1. విశ్వ రూపం

విశ్వ రూపం, విశ్వ ఆవిర్భావం అల్లాహ్ ఉనికిని సూచించే మొదటి సాక్ష్యం

ఒక్కసారి ఆలోచించండి!

మీరు ఎడారిలో నడుస్తుండగా మీకు గడియారం దొరికింది. గడియారం గాజు, ప్లాస్టిక్, మెటల్‌తో తయారు చేయబడిందని మీకు తెలుసు. గ్లాస్ ఇసుకతో తయారు చేయబడింది, ప్లాస్టిక్‌ను పెట్రోలియంతో తయారు చేస్తారు. లోహాన్ని భూమి నుండి వెలికి తీస్తారు- ఈ మూలకాలన్నీ ఎడారిలో కనిపిస్తాయి. మరి గడియారం స్వయంగా తన్ను తానే సృష్టించుకుంది అంటే మీరు నమ్మగలరా? సూర్యుడు ఉదయించాడు, తర్వాత గాలి వీచింది, మెరుపులు సంభవించాయి, ఆపై చమురు ఉపరితలంపైకి తేలి, ఇసుక, ఇతర ఖనిజాలతో కలిసిపోయింది. ఈ ప్రక్రియ లక్షల సంవత్స రాలుగా జరిగినా- గడియారం యాదృచ్ఛిక ఒక విస్ఫోటన ఫలితంగా ఉనికిలోకి రాగలదా?

మానవ అనుభవం, సరళమైన తర్కం మనకు చెప్పేదేమిటంటే, ప్రారంభాన్ని కలిగి ఉన్నది ఏదీ అకస్మాత్తుగా శూన్యం నుండి పుట్టుకు రావడం జరగదు. అలాగే అది స్వయంగా తన్ను తానూ సృష్టించుకోజాలదు.

కాబట్టి, అత్యంత హేతుబద్ధమైన వివరణ ఏమిటంటే, ఈ విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త ఉన్నాడు. అటువంటి ''సృష్టికర్త'' సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడై ఉండాలి, ఎందుకంటే అతను ఈ మొత్తం విశ్వాన్ని ఉనికిలోకి తెచ్చాడు. దానిని పరిపాలించడానికి ''జ్ఞాన నియమాలను'' సృష్టించాడు. ఈ లక్షణాలన్నీ విశ్వ సృష్టికర్త అయిన అల్లాహ్ ప్రాథమిక భావనను కలిగి ఉంటాయి. ఈ తౌహీద్ భావన ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి పూర్తి అనుగుణంగా ఉంది. ఈ విశ్వం పరిమితమైంది, దానికి ఒక ప్రారంభం, ముగింపు ఉంది.

కొందరు ఇలా అడగవచ్చు: ''దేవుణ్ణి సృష్టించింది ఎవరు? అల్లాహ్ ఆయన సృష్టికర్త. తన సృష్టికి అతీతంగా ఉంటాడు. అల్లాహ్ ఆయనే ఆది, ఆయనకు ముందు ఏది లేదు. ఆయనే అంతం. ఆయన తర్వాత ఏదీ ఉండదు. ఆయనకు ఆది అంతాలు

లేవు. కాబట్టి అల్లాహ్‌ను ఎవరు సృష్టించారు అనే ప్రశ్న అశాస్త్రీయమైనది. అసంబద్ధమైనదీనూ.

## 2. విశ్వం పరిపూర్ణత

సర్వజ్ఞుడైన సృష్టికర్త ఉనికికి రెండవ సాక్ష్యం ఈ విశ్వ బ్రహ్మాండం ఖచ్చితమైన నిర్మాణం, క్రమబద్ధత, సమతుల్యత.

భూమి, సూర్యుని మధ్య దూరం, భూమి, క్రస్ట్ మందం, వాతావరణంలో ఆక్సిజన్ నిష్పత్తి, భూమి ఉష్ణోగ్రత వంటి ఈ విశ్వం అనేక లక్షణాలు- అవి జీవితాన్ని భూమి మీద సాధ్య మయ్యేలా ప్రత్యేకంగా రూపొందించినట్లు స్పష్టంగా సూచిస్తు న్నాయి. ఈ కొలతలు కొద్దిగా భిన్నంగా ఉండి ఉంటే, ఈ భూమిపై మానవ మనుగడ అసాధ్యమయ్యేది.

గడియారం కరెక్ట్ సమయాన్ని చూపాలంటే, దానికి ఖచ్చితంగా సమయం తెలిసిన ఓ సృష్టికర్త తప్పనిసరిగా ఉండాలి. ఇదే సూత్రాన్ని అనుసరించి, ఈ భూమిని సంరక్షించ డానికి సర్వజ్ఞుడైన సృష్టికర్త కూడా తప్పక ఉండాలి. ఇదంతా ఆకస్మికంగా, యాదృచ్ఛికంగా జరుగుతుందా చెప్పండీ?

మనలో, విశ్వమంతటా కానవచ్చే నియంత్రణ, ఆకృతీకరణ, సూక్ష్మ వ్యవస్థలను మనం గమనించినప్పుడు, వీటన్నింటికీ ఒక నిర్మాత, నిర్వహణకర్త ఉండాలనేది హేతుబద్ధమేగా? అటువంటి ''నిర్మాత- నిర్వహణకర్త''కి అత్యుత్తమ వివరణ ఏమిటంటే, విశ్వం లోని ఈ క్రమబద్ధతను, సమతుల్యతను, పూర్ణత్వాన్ని నిర్మించిన దేవుడు- ఒకే ఒక్కడు.

సర్వ శ్రేష్ఠుడైన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: నిశ్చయంగా భూమ్యాకాశాల నిర్మాణంలో, రాత్రింబవళ్ళ చక్రభ్రమణంలో యోచించే వారికి ఎన్నో నిదర్శనాలున్నాయి. (ఆలి ఇమ్రాన్: 190)

## 3. అల్లాహ్ తరపున వచ్చిన దివ్యావిష్కృతి

అల్లాహ్ ఉనికిని నిరూపించే మూడవ సాక్ష్యం - మానవాళి కోసం పంపిన నిజమైన దివ్యావిష్కృతి అల్లాహ్ తన ఉనికిని తెలియజేసే గొప్ప ఆధారం. ఖుర్‌ఆన్ అల్లాహ్ వాక్యమని స్పష్టమైన సూచనలు ఉన్నాయి. ఖుర్‌ఆన్ నిజంగా అల్లాహ్ వాక్యమని నిరూపించే రుజువుల సంక్షిప్త సారాంశం క్రింద ఇవ్వబడింది.

అల్లాహ్ ప్రజల మార్గనిర్దేశం కోసం ఒక గ్రంథాన్ని అవతరింప జేశాడంటే, ఆ గ్రంథంలో ఆయన ఉనికికి సంబంధించిన స్పష్టమైన ఆధారాలు ఖచ్చితంగా తెలియజేయబడి ఉంటాయి.

దివ్య ఖుర్‌ఆన్ 1448 సంవత్సరాల క్రితం అవతరింపజేయ బడింది. దాని అవతరణ సమయంలో ప్రజలకు తెలియని అనేక శాస్త్రీయ వాస్తవాలు ఇందులో ఉన్నాయి; వాటిని ఇటీవల ఆధునిక విజ్ఞాన శాస్త్రం కనుగొంది. ''అన్ని జీవులకు మూలం జలం'' (సూరత్ అల్-అన్బియా (వచనం: 30).

భూమ్యాకాశాలు కలసి ఉన్నప్పుడు మేము వాటిని విడదీయడాన్ని వారు చూడలేదా? అలాగే ప్రతి ప్రాణిని మేము నీటితో సృజించిన విషయాన్ని వీరు గమనించ లేదా? మరి వారు (మా ఈ సృష్టి చాతుర్యాన్ని) ఎందుకు విశ్వసించరు?

అలాగే సూర్యుడు, చంద్రునికి నిర్దిష్ట కక్ష్యలు ఉన్నాయి. సూరా అల్-అన్బియా (వచనం: 33) భూమి దొర్లిపడకుండా ఉండేందుకు మేము దానిపై పర్వతాలను (మేకులుగా) పాతాము. ప్రజలు దారి తెలుసుకోవడానికి వీలుగా అందులో విశాలమైన మార్గాలు కూడా ఏర్పరిచాము. అంతేకాదు, ఆకాశాన్ని మేము సురక్షితమైన కప్పుగా చేశాం. కాని వీరు మాత్రం ఆయన నిదర్శనాల వైపు దృష్టి సారించడమే లేదు. రేయింబవళ్ళను సృష్టించినవాడు దేవుడే. సూర్యచంద్ర నక్షత్రాలను కూడా ఆయనే సృజించాడు. అవన్నీ తమ తమ నిర్ణీత కక్ష్యల్లో తేలియాడుతున్నాయి.

దివ్య ఖుర్‌ఆన్‌లో - దాని అవతరణ సమయంలో లోకులకు తెలియని అనేక చారిత్రక వాస్తవాలు, అలాగే ఆ తర్వాత సరైనవని తేలిన అనేక ప్రవచనాలు ఉన్నాయి.

దివ్య ఖుర్‌ఆన్ 23 సంవత్సరాల కాలంలో అవతరింపబడి నప్పటికీ, ఖుర్‌ఆన్ ఎలాంటి దోషాలు, వైరుధ్యాలు లేకుండా ఉంది. అలాగే ఖుర్‌ఆన్ గ్రంథం ఇహలోక జీవితానికి, పరలోక జీవితానికి సంబంధించిన అనేక అంశాలను విశదపర్చింది.

దివ్య ఖుర్‌ఆన్ దాని అసలు భాష అరబీలో అవతరించినప్పటి నుండి నేటి వరకు అల్లాహ్ ఖుర్‌ఆన్ గ్రంథాన్ని భద్రపరిచాడు. నేడు మొదలు ప్రళయం వరకు సంరక్షించే బాధ్యతను ఆయనే స్వయంగా తీసుకున్నాడు. దీనికి భిన్నంగా అల్లాహ్ తన ఇతర

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల సావురాయి
గీటురాయి
వారపత్రిక

ప్రవక్తలకు ప్రసాదించిన స్వచ్ఛమైన గ్రంథాలు ఆయా గ్రంథ ప్రజల జోక్యంతో మార్పుచేర్పులకు గురయి తమ స్వచ్ఛతను కోల్పోయాయి.

దివ్య ఖుర్‌ఆన్ స్వచ్ఛమైన, స్పష్టమైన విశ్వజనీన సందేశం గల గ్రంథం. అది సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ గురించి మనిషిలో నిద్రాణంగా ఉన్న అచంచల విశ్వాసాన్ని, నిర్మల నైజాన్ని తట్టి లేపుతుంది.

దివ్య ఖుర్‌ఆన్ ప్రజలను అద్భుతంగా ప్రభావితం చేస్తుంది. దాని మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించిన హృదయం గలవారికే దాని రుచి తెలుస్తుంది.

మహనీయ ముహమ్మద్ (స) నిరక్షరాస్యులని చరిత్రలో ప్రసిద్ధి. కానీ, ఆయన తీసుకొచ్చిన ఖుర్‌ఆన్ గ్రంథం ఒక ప్రత్యేకమైన భాషా శైలిని కలిగి ఉంది. దివ్య ఖుర్‌ఆన్ అరబీ వాగ్ధాటికి, భాషా సౌందర్యానికి పరాకాష్టగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.

పై విశిష్టతలను బట్టి - దివ్య ఖుర్‌ఆన్ అల్లాహ్ తరపు నుండి వచ్చినది అనేది చాలా హేతుబద్ధమైన వివరణ అని స్పష్టమయింది. ఎందుకంటే ఇందులో ఎన్నో విశిష్టమైన అంశాలు, అద్భుతమైన విషయాలు ఉన్నాయి.

## అల్లాహ్ మానవాళికి మార్గనిర్దేశనం చేస్తాడు

వివేకవంతుడైన సృష్టికర్త మనల్ని సృష్టించాడని మనం అంగీకరించినప్పుడు, మన ఉనికి ఉద్దేశ్యాన్ని, మన జీవిత లక్ష్యాన్ని ఆయన మనకు ఖచ్చితంగా బోధిస్తాడని మనం గ్రహిస్తాము. అయితే అల్లాహ్ మన నుండి ఏమి కోరుకుంటున్నాడో మనం ఎలా తెలుసుకోగలం?

మనం ప్రయోగశాల, తప్పుల తడిక వంటి జీవితాన్ని గడుపుతున్నామా? లేదా మన ఉనికి ఉద్దేశ్యాన్ని మనమే నిర్ణయించుకుంటామా?

అధిక శాతం మంది ప్రజలు తప్పు చేస్తే మీరు వారినే అనుసరిస్తారా?

ఎంత మాత్రం తగదు, అల్లాహ్ మన ఉనికి ఉద్దేశ్యాన్ని మనకు తెలియ జేయడానికి దైవప్రవక్తలను పంపాడు. వారిపై ఆకాశ గ్రంథాలను అవతరింపజేశాడు.

సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ దైవప్రవక్తలను పంపాడు. ప్రతి జాతి వద్దకు కనీసం ఒక దైవ ప్రవక్తనైనా సరే ప్రభవింపజేశాడు. దైవ ప్రవక్త రాని మూల జాతి అంటూ ఏది లేదు. ప్రవక్తలందరి సమిష్టి సందేశం- నిజ దేవుడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలీ అన్నదే. ఆ ప్రవక్తల పరంపరలో ఆదమ్, నూహ్, ఇబ్రాహీమ్, మూసా, ఈసా (అలైహిముస్సలామ్), ముహమ్మద్ (స) కూడా ఉన్నారు.

మహనీయ ముహమ్మద్ (స) ప్రవక్తల ఈ పరంపరలో చిట్ట చివరివారు. మానవ రతనాల రాశికి చెందిన మహా మనీషి. ఆయన- గొప్ప నిజాయితీ, వాగ్దాన పాలన, దయ, ధైర్యం వంటి ఉత్తమ లక్షణాలు కలిగిన మహితాత్ముడు. ఆయనకు ఖుర్‌ఆన్ గ్రంథం ఒసగబడింది. అల్లాహ్ తరపు నుండి ప్రలందరి కోసం పంపబడిన కట్ట కడపటి సందేశం. ఆయన ఖుర్‌ఆన్ బోధనలను వారి జీవితాల్లో ఎలా అన్వయించుకోవాలో ప్రజలకు నేర్పించే వారు.

దివ్య ఖుర్‌ఆన్ మార్గదర్శక గ్రంథం. అది మానవ జీవితానికి సంబంధించిన అనేక కీలకమైనటువంటి అర్థాలను, భావాలను వివరిస్తుంది. ఉదాహరణకు- మన జీవిత లక్ష్యం ఏమిటి? మనందరి సృష్టికర్త ఎవరు? అల్లాహ్‌కు నచ్చిన విషయాలు ఏమిటి? ఆయన ఇష్టపడని విషయాలు ఏవి? మొదలయినవి. అలాగే దైవప్రవక్తల గాథలు, పూర్వ జాతుల వృత్తాంతాలు, చారిత్రక పాఠాలు, గుణపాఠాలు, స్వర్గ నరకాలకు సంబంధించిన విషయాలు, ప్రళయ దినానికి సంబంధించిన వివరాలూ దివ్య గ్రంథం మనకు తెలియజేస్తుంది.

దివ్య ఖుర్‌ఆన్ లక్ష్యాల్లోని ఓ లక్ష్యం - అల్లాహ్ చుట్టూ చోటు చేసుకున్న అపనమ్మకాలు, అవిశ్వాసాల, మూఢాచారాల ప్రక్షాళన. ఉదాహరణకు- ప్రవక్త ఈసా(అ) అస్తిత్వం ఎలాంటిది? అద్వితీయుడైన అల్లాహ్ విశిష్ట అస్తిత్వం ఎలాంటిది? రెంటికి మధ్య సారూప్యత సాధ్యమా? కాదా? అన్న వివరాలను తెలియజేయడమే కాకుండా- ఈసా ఓ ప్రవక్త, మానవ మాత్రుడు మాత్రమే, దైవంగా గానీ, దైవ కుమారుడు గానీ కాదు అని ప్రకటిస్తుంది.

ప్రవక్త ఈసా(అ) వారి చేతుల మీదుగా అల్లాహ్ అనేక మహిమల్ని చూపించాడు సందేహమే లేదు. ఇతర ప్రవక్తలకు ఇవ్వబడినటువంటి మహిమలే ఆయనకూ ఇవ్వబడ్డాయి. ఆయన ప్రజలందరిని వారి నిజ ఆరాధ్యుడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని పిలుపునిచ్చారు. (ఈసా ప్రజలకు హితబోధ చేస్తూ) "అల్లాహ్ యే నా ప్రభువు. మీ ప్రభువు కూడా ఆయనే. కనుక మీరు ఆయన్నే ఆరాధించండి. ఇదే సరైన మార్గం" అన్నాడు.

(అల్-మర్యమ్: 36)

## ప్రవక్త ఈసా, ఆయనకు శాంతి కలుగుగాక

నిజ దేవునిపై విశ్వాసం గురించి మాట్లాడేటప్పుడు ఈసా(అస) గురించి ప్రస్తావించడం అవసరం. ఎందుకంటే, ఆయన గురించి

అనేక వాదనలు ఉన్నాయి, గందరగోళ పరిస్థితి ఉంది గనక.

కొంత మంది ఈసా (అస)ను - ఆయన దేవుడు భూమిపై మానవుల రూపంలో అవతరించాడు గనక  దేవుడు లేదా ముగ్గురిలో మూడవవాడు అని నమ్ముతారు.

యదార్థమేమిటంటే, ఆయన తిన్నారు, త్రాగారు, నిద్రపోయారు, ప్రార్థన చేసారు. ఆయనకున్న జ్ఞానం పరిమితం- ఈ లక్షణాలన్నీ మానవ లక్షణాలు. నిజ దైవమైన అల్లాహ్‌కు శోభించే లక్షణాలు కావు. అల్లాహ్ గుణగణాల రీత్యా, శక్తిసామర్థ్యాల రీత్యా పరిపూర్ణుడు. దీనికి భిన్నంగా మనిషిలో ఈ పూర్ణత ఉండదు. ఒక వస్తువు ఏక సమయంలో రెండు వ్యతిరేక విషయాల రూపంలో ఎలా ఉండగలదు?- అంటే అది పూర్ణంగానూ, అసంపూర్ణంగా ఏక సమయంలో ఉండటం ఎలా సాధ్యం? ఇది ముమ్మాటికీ హేతుబద్ధం, నమ్మశక్యం  కాదు.

ఇది తెలిసి కూడా కొందరు- దేవుడు అన్ని చేయగల  సమర్థుడు అయినప్పుడు ఆయన  ఎందుకు మనిషిగా మారలేడు? అని వాదిస్తారు.

నిజ దేవుని  నిర్వచనం ఆధారంగా, అల్లాహ్  తనకు శోభించని పనులు చెయ్యడు. సర్వశక్తిమంతుడు కాబట్టి, ఒకవేళ దేవుడు మానవుడిగా మారి, మానవ లక్షణాలను సంతరించుకుంటే, ఇక ఆయన  దాని తర్వాత  దేవుడుగా కొనసాగలేడు.

అంతేకాకుండా, క్రైస్తవ గ్రంథం  బైబిల్‌లో-  ఈసా (అ.స) తన్ను తాను అల్లాహ్  దాసునిగా, ఆయన సేవకునిగా పేర్కొన్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అలాగే అల్లాహ్ వేరు,  ఈసా (అస) వేరు అని తెలియజేసే వచనాలు కూడా ఎన్నో ఉన్నాయి.

కొంత మంది ఈసా (అస) అల్లాహ్ కుమారుడని వాదిస్తారు. ఇక్కడ మనల్ని మనం ప్రశ్నించుకోవాలి: దీని అర్థం ఏమిటి? వాస్తవానికి అల్లాహ్ ఎంతో పరిశుద్ధుడు. వారు కల్పించి పలుకు తున్న మాటలకు ఆయన ఎంతో అతీతుడు. దేహపరంగా గానీ, మాట వరసకు గానీ ఆయనకు సంతానం ఉంది అన్న అపప్రదకు ఆయన అతీతుడు.

పైగా, "దేవుని (అల్లాహ్)  కుమారుడు" అనే  పదాన్ని పురాతన బైబిల్ భాషలలో ధర్మపరాయణులైన దాసులను  ఉద్దేశించి ఉపయోగించినట్లు మనం గమనిస్తాము.

ఈ పదం - దావూద్, సులేమాన్, యాకూబ్ వంటి అనేక మంది ప్రవక్తల గురించి పాత నిబంధనలో విస్తృతంగా ఉపయోగించ బడింది.

ఒకర్ని కొడుకుగా చేసుకోవడం అల్లాహ్‌కు ఏ మాత్రం శోభించదు. ఆయన ఎంతో పరిశుద్ధుడు. ఆయన ఏదైనా చేయదలచుకుంటే 'అయిపో' అంటే చాలు, ఆ పని ఇట్టే చిటికలో జరిగిపోతుంది. (అల్-మర్యమ్: 35)

అయినా మానవులు తమ సృష్టికర్తయిన అల్లాహ్‌కు ఇతరులను సాటికల్పించి పూజిస్తున్నారు. పైగా  వారు  తెలిసో తెలియకో ఆయనకు కొడుకుల్ని, కూతుళ్ళను అంట గడ్తున్నారు. కాని అల్లాహ్ ఎంతో పరిశుద్ధుడు. వారు కల్పించి పలుకుతున్న మాటలకు ఆయన ఎంతో అతీతుడు. ఆయన యావత్తు భూమ్యాకాశాలనే సృష్టించిన అద్భుత శక్తి సంపన్నుడు. ఆయనకసలు భార్యే లేనప్పుడు సంతానం ఎలా కలుగుతుంది? ఆయనే ప్రతిదాన్నీ సృష్టించేవాడు, ప్రతి విషయమూ తెలిసినవాడు.

అలాంటి అల్లాహ్‌యే మీ ప్రభువు. ఆయన తప్ప మరో నిజ దేవుడు లేడు. ఆయనే సర్వసృష్టి కర్త. కనుక మీరు ఆయన్నే ఆరాధించండి. ఆయనే అందరికీ సంరక్షకుడు. ఎవరి చూపులూ ఆయన్ని అందుకోలేవు. ఆయన మాత్రం అందరి చూపుల్నీ అందుకోగలడు. ఆయన ఎంతో సునిశితదృష్టి కలవాడు, ప్రతిదాన్నీ తెలుసుకోగలవాడు.

"ఇప్పుడు మీ ప్రభువు నుండి మీదగ్గరికి స్పష్టమైన ఆధారాలు వచ్చాయి. కనుక కళ్ళు తెరచి చూసేవాడే ప్రయోజనం పొందగలడు. (కళ్ళుండీ చూడలేని) గుడ్డివాడు తననే నష్ట పరచుకుంటాడు. నేను మీపై పర్యవేక్షకుడ్ని కాను" (అని చెప్పు). ఈవిధంగా మేము మా సూక్తుల్ని మాటిమాటికి విభిన్న రీతులలో విశదీకరిస్తున్నాం. (అల్-అన్‌ఆమ్: 105)

ఇస్లాం ధర్మం ఈసా (అస)ను ఆయన యధాస్థితిలో విశ్వసించ మంటుంది. అదే సమయంలో అల్లాహ్  గొప్పతనం, ఆయన మహిమకు భంగం కలిగించే విషయాలకు  దూరంగా ఉంటూ ఆయన్ను విశ్వసించమంటుంది. ఈసా(అస) అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని పిలుపునిచ్చేందుకు సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ పంపిన గొప్ప ప్రవక్త.

ఇంకా ఈ విధంగా చెప్పండి: "స్తుతిస్తోత్రాలకు అల్లాహ్  మాత్రమే అర్హుడు. ఆయన ఎవర్నీ కొడుకుగా చేసుకోలేదు. విశ్వ సార్వ భౌమత్వంలో ఆయనకు ఎవరూ భాగస్వాములు లేరు. ఒకరి సహాయసహకారాలపై ఆధారపడటానికి ఆయన ఎంతమాత్రం అశక్తుడు, అసమర్థుడు కాదు." ఆయన ఔన్నత్యాన్ని, అద్భుత శక్తిసామర్థ్యాలను ఘనంగా కీర్తించండి. (బనీ ఇస్రాయీల్: 111)

## మరి .... నేను ఇక్కడ ఎందుకున్నాను?

మానవ శరీరంలోని కళ్ళు, చెవులు, మెదడు మరియు గుండె వంటి అవయవాలు- వాటికంటూ ఒక నిర్దిష్ట ప్రయోజనం, లక్ష్యం ఉందని అందరూ అంగీకరిస్తారు, అయితే, మొత్తం వ్యక్తికంటూ ఒక లక్ష్యం, ఒక ప్రయోజనం ఖచ్చితంగా ఉండి తీరాలి అన్నది పూర్తి సహేతుకమే కదా?

సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడైన అయిన అల్లాహ్ మనల్ని లక్ష్య రహితంగా, గమ్య రహితంగా- జీవితంలో కొట్టుమిట్టా డేందుకు సృష్టించలేదు. కేవలం తినడం, త్రాగటం, కోరికలు తీర్చుకోవడం కోసం మాత్రమే జీవిత ఉద్దేశ్యం కాదు. మనకంటూ ఓ ఉత్కృష్టమైన ఆశయం, గొప్ప లక్ష్యం ఉంది. అదే - సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ ఉనికిని గుర్తించి, ఆయనను మాత్రమే ఆరాధించాలి. మనం మన సృష్టికర్త మార్గదర్శకత్వం ప్రకారం జీవించాలి. ఈ మార్గదర్శకత్వం మనల్ని సంతోషకరమైన, సౌభాగ్య వంతమైన, శుభవంతమైన జీవితం వైపునకు నడిపిస్తుంది. ఈ మార్గదర్శకత్వం వ్యక్తికి ప్రయోజనం కలిగించే అంశాలను కలిగి ఉంటుంది. ఉదాహరణకు - నమాజు.

అలాగే సమాజంపై కూడా దీని ప్రభావం గొప్పగా ఉంటుంది. ఉదాహరణకు- పొరుగువారి పట్ల పరోపకారం, కుటుంబం పట్ల శ్రద్ధ, నిజాయితీ, జంతువులను దయతో చూసుకోవడం వంటివి.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తనను తప్ప ఇతరులను పూజించ కూడదని ఆదేశించాడు. అది విగ్రహం కావచ్చు, సూర్యుడు కావచ్చు, చంద్రుడు కావచ్చు, ధర్మాత్ములు కావచ్చు, సన్యాసులు లేదా ప్రవక్తలు కావచ్చు. వీటిలో దేనినీ ఆరాధించకూడదు. ఆ రకంగా ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా, ఎప్పుడైనా, ఎక్కడయినా అల్లాహ్‌ను ఆరాధించవచ్చు. ఎవరి మధ్యవర్తిత్వ అవసరం లేదు. సిఫారసు అసలే అక్కర్లేదు.

అల్లాహ్ ఈ జీవితాన్ని పరీక్షా స్థలంగా చేసాడు. ఇక్కడ ప్రజలను అనేక రకాలుగా పరీక్షించడం జరుగుతుంది. మన జీవితంలో మన ప్రమేయం లేకుండా జరిగే విషయాలను మనం నియంత్రిం చలేము, కానీ మన కర్మల్ని, మన ప్రవర్తనను మనం నియం త్రించగలము, సంస్కరించుకోగలం. ఆ మాత్రం స్వేచ్ఛ మనకుంది.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు మనల్ని దగ్గర చేసి, స్వర్గంలో మనం ప్రవేశించడానికి కారణమయ్యే మార్గాలలో ఒకటి - కష్ట సమయాల్లో - లేమిలో సహనం, సంపన్న స్థితిలో - కలిమిలో కృతజ్ఞతలు. అలాగే, ఒకవేళ మనం ఆయన్ను విశ్వసించక పోయినా, ఆయన ఆజ్ఞలను ధిక్కరించినా- పరిణామం, శిక్ష చాలా తీవ్రంగా ఉంటుందని కూడా హెచ్చరించాడు.

## మరి... నేను ఇప్పుడు ఏమి చేయాలి?

ఒక వ్యక్తి విశ్వాస పరీక్ష అనేది అతని తెలివిని సరిగ్గా ఉపయో గించడంలోనూ, మనస్సుతో కరెక్టుగా అర్థం చేసుకోవడంలోనూ ఉంటుంది. అల్లాహ్ ఉనికికి సంబంధించిన రుజువులను గుర్తించి, ఆయన ఆజ్ఞలు, నిషేధాలకు అనుగుణంగా జీవించడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. అది అల్లాహ్ ఆదేశాలకు పూర్తిగా తన్ను తాను సమర్పించుకోవడం ద్వారా సాకారం అవుతుంది. దీనినే - అరబీలో - “ముస్లిం”గా మారడం అంటారు.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇస్లాం ధర్మాన్ని సర్వ జనులందరి కోసం సమ్మతించి ఆమోదించాడు. వారి వంశం, కుల, ప్రాంత, గోత్ర, వర్గ, వర్ణ నేపథ్యం, విశ్వాసం, వైరాగ్యం, ఇతర ఏ స్థితికి అతీతంగా ఇస్లాం ధర్మాన్ని అందరి కోసం అందుబాటులో ఉంచాడు. క్రింది సాక్ష్యాన్ని పలికి, భావార్థాన్ని తెలుసుకొని నడుచుకోవాలనుకునే ఏ వ్యక్తి అయినా ముస్లిం కావచ్చు.

అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్.

అల్లాహ్ తప్ప నిజ ఆరాధ్యుడు ఎవ్వరూ లేరని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్త అని నేను (మనసా, వాచా, కర్మణా - త్రికరణ శుద్ధితో) సాక్ష్యమిస్తున్నాను.

ఏమిటి, మీరు ఏ లక్ష్యం కోసం సృష్టించబడ్డారో దాన్ని గ్రహించి, సత్యాన్ని స్వీకరించి- దాని ప్రకారం జీవించి, నిజ సృష్టికర్త ఉనికిని గుర్తించి, ఆయన్ను సంపూర్ణ పద్ధతిలో ఆరాధించుకునే సమయం ఇంకా ఆసన్నం కాలేదా?

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: నేను మానవుల్ని, జిన్నుల్ని నన్ను ఆరాధించడానికి తప్ప మరే లక్ష్యంతో పుట్టించలేదు. నేను వారి నుండి ఉపాధి కోరడం లేదు. నాకు తిండి పెట్టమని అడగడం లేదు. నిశ్చయంగా అల్లాహ్‌యే అందరి ఉపాధి ప్రదాత. ఆయన మహాబలుడు, అద్భుత శక్తిసంపన్నుడు. (అజ్-జారియాత్: 56-58)

# ఇస్లాంలో శుచీ శుభ్రతలకు ప్రాముఖ్యం

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

**ఇస్లాం** ధర్మంలో 'తహారత్'కు అంటే శుచీ శుభ్రతలకు ఎనలేని ప్రాముఖ్యత ఉంది. నమాజు, దివ్య ఖుర్ఆన్ పారాయణం, కాబా గృహ ప్రదక్షిణ లాంటి ఆరాధనలకే అది పరిమితం కాదు. 'తహారత్' ధర్మంలోని ఒక భాగమని ఖుర్ఆన్, హదీసుల ద్వారా తెలుస్తుంది.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా తెలిపాడు: "దేవుడు తన వైపునకు మరలేవారిని, పవిత్రంగా, పరిశుభ్రంగా ఉండే వారిని మాత్రమే ప్రేమిస్తాడు." (అల్ బఖర : 222)

"విశ్వాసులారా! నమాజు చేయడానికి సిద్ధమైనప్పుడు ముందుగా మీరు ముఖాన్ని, మోచేతుల దాకా చేతులు కడుక్కోండి. తలను తడిచేత్తో స్పర్శించండి. కాళ్ళు చీలమండలదాకా కడుక్కోండి. అశుద్ధావస్థ ఏర్పడితే పరిశుభ్రంగా తలంటు స్నానం చేయండి.."
(అల్ మాయిదా 5:6)

"పవిత్రుడైనవాడు ఖచ్చితంగా సాఫల్యం పొందుతాడు."
(అల్ ఆలా 87: 14)

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : "నిరాడంబరంగా జీవితం గడపటం కూడా విశ్వాసంలోని ఒక భాగమే."
(అబూదావూద్)

మహాప్రవక్త(స) మస్జిద్‌లో ఉపనిష్ఠులయి ఉండగా ఒక వ్యక్తి ప్రవేశించాడు. అతని వెంట్రుకలు, గడ్డం అంతా చిందరవందరగా ఉన్నాయి. అప్పుడు మహాప్రవక్త వెళ్ళి తల, గడ్డం సరిగ్గా దువ్వుకొని రమ్మని తన చేత్తో సంజ్ఞ చేశారు. అతను అలాగే వెళ్ళి తల, గడ్డం సంస్కరించుకుని వచ్చాడు. అప్పుడు ఆయన 'ఇది బాగుండలేదా? తల వెంట్రుకలు చిందర వందరగా ఉండి మనిషి ఓ సైతానులా కనబడడంకంటే" అని అన్నారు. (మిష్కాత్)

అబుల్ అహ్వస్ తన తండ్రి ఇలా చెప్పినట్లు ఉల్లేఖించారు : "నేను ఒకసారి మహాప్రవక్త(స) వద్దకు వెళ్ళాను. అప్పుడు నా దేహంపైన ఉన్న బట్టలు ఎంతో సాధారణమయినవి. మహాప్రవక్త అడిగారు 'నీ వద్ద ధనముందా?' నేను "అవును, ఉంది" అన్నాను. 'నీ వద్ద ఉన్నది ఎలాంటి ధనం?' అని అడిగారు ఆయన. "నా వద్ద సమస్త ఐశ్వర్యాలున్నాయి. దేవుడు నాకు ఒంటెలు, గోవులు, మేకలు, గుర్రాలు ప్రసాదించాడు. ఇంకా సేవకులూ ఉన్నారు" అని బదులిచ్చాను. దానికి మహాప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ నీకు ఐశ్వర్యం ప్రసాదించినప్పుడు ఆయన కృపానుగ్రహాల ప్రభావం నీ శరీరంపైన వ్యక్తమవ్వాలి కదా!' (మిష్కాత్)

"ప్రళయదినాన నా అనుచర సముదాయాన్ని (కర్మ విచారణ కోసం) పిలవడం జరుగుతుంది. అప్పుడు వారి ముఖాలు, కాళ్ళు, చేతులు వుజూ ప్రభావంతో తెల్లగా, ఉజ్వలంగా ఉంటాయి. కాబట్టి మీలో ఎవరైనా తమ తెలుపు, తేజస్సులను వృద్ధి చేసుకోదలచుకుంటే వారు వుజూ చేస్తున్నప్పుడు పూర్తిగా ముఖం కడుక్కొని వృద్ధి చేసుకోవచ్చు." (బుఖారీ)

## మిస్వాక్ ప్రాముఖ్యం

పవిత్రత, పరిశుభ్రత విషయంలో దైవప్రవక్త(స) అత్యంత ప్రాముఖ్యతనిచ్చిన విషయాల్లో 'మిస్వాక్' కూడా ఒకటి.

మిస్వాక్ నోటిని బాగా శుభ్రపరిచి, దైవాన్ని అమితంగా ప్రసన్నం చేసే వస్తువు' అని దైవప్రవక్త(స) తెలిపారు. (బుఖారీ)

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




**భారత జనాభా** ప్రపంచంలోనే అత్యధిక జనాభాగా మారింది. చైనాను అధిగమించి భారతదేశం ప్రపంచంలో మొదటిస్థానానికి చేరుకుంది. అధిక జనాభాపై అనేక మంది ఆందోళన వెలిబుచ్చుతున్నారు. జనాభా గురించి పలువురు పలు విధాలుగా మాట్లాడుతున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలు తీరడానికి కావలసిన వనరులు లభిస్తాయా అన్న అనుమానాలు వెలిబుచ్చుతున్నారు.

ప్రధాని మోడీ రాజస్థాన్‌లోని ఎన్నికల సభలో మాట్లాడుతూ కాంగ్రెసు అధికారంలోకి వస్తే ప్రజల సంపదను లాక్కుని చొరబాటు దారులకు, అధిక సంతానం ఉన్నవారికి పంచేస్తుందని విద్వేష ప్రసంగం చేశారు. ముస్లిములను చొరబాటుదారులు అనడమే కాదు, అధిక సంతానం కలవారిగా చెబుతూ దేశ జనాభా పెరగడానికి ముస్లిములే కారణమన్నట్లు మాట్లాడారు.

ఒకసారి ముస్లిముల జనాభా పెరుగుదల గణాంకాలు చూద్దాం. 2011 జనాభా గణాంకాలు మాత్రమే మన వద్ద ఉన్నాయి. వాటి ప్రకారం ముస్లిముల జనాభా 2011లో 17.22 కోట్లు. అంటే దేశ జనాభాలో 14.2 శాతం. అంతకు ముందు 2001లో ముస్లిముల జనాభా 13.81 కోట్లు. వృద్ధి రేటు కేవలం 0.8శాతం. నేషనల్ శాంపుల్ సర్వే 68వ నివేదిక ప్రకారం హిందూ కుటుంబం పరిమాణం 4.3 కాగా ముస్లిం కుటుంబం పరిమాణం 5. అలాగే 1951 నుంచి 2011 మధ్య కాలంలో ముస్లిం జనాభా 136 మిలియన్లకు చేరుకుంటే హిందూ జనాభా 676 మిలియన్లకు చేరుకుంది. ఈ గణాంకాలను పరిశీలిస్తే ముస్లిములకు అధిక సంతానం ఉంటుంది, వాళ్ళ వల్లనే జనాభా పెరుగుతుందన్న వాదనల్లో సత్యం లేదని తెలుస్తుంది.

పెరుగుతున్న జనాభా విషయానికి వస్తే, కొంతకాలం క్రితం ప్రకృతి భరించే శక్తి (నేచర్ సస్టెయినబిలిటీ) అనే పత్రంలో కొందరు శాస్త్రవేత్తల బృందం భూమి మహా అయితే 700 కోట్ల జనాభాను మాత్రమే భరించగలదని చెప్పారు. కాని ఈ పరిమితిని ఎప్పుడో దాటేశాం. జనాభా అందరికీ ఉత్తమస్థాయి జీవితం సాధించడంలో భూమి జీవభౌతిక పరిమితులు అతిక్రమించడం జరుగుతుందని, దానివల్ల పర్యావరణ సంక్షోభం నెలకొంటుందని అంటారు.

ఈ మాటలు శాస్త్రీయంగా ఖచ్చితమని చెబుతున్నప్పటికీ, ఇవి చాలా పాత మాటలు. ఇవి కొత్తవి కావు. తాజాగా ఇదే పునరుద్ఘాటించడం జరిగింది. జనాభా, జనాభా అవసరాలు త్వరలోనే భూమి భరించే సామర్థ్యాన్ని దాటి పోతాయని అంటున్నారు. ఈ మాటలు నిజానికి 19వ శతాబ్దంలో స్టీం ఓడలు మోసుకువెళ్ళే సరుకుల భారాన్ని దృష్టిలో ఉంచుకుని చెప్పిన మాటలు. ఆ తర్వాత హఠాత్తుగా ఓడలు, వాహనాల నుంచి 19వ శతాబ్దం చివరి నాటికి భూమి భరించే శక్తిని తీర్మానించే స్థాయికి వెళ్ళాయి. పర్యావరణంలో గడ్డిమైదానాలు ఎంత సంఖ్యలో పశువులకు పోషణనివ్వగలవో చెప్పడం ప్రారంభమైంది.

పర్యావరణానికి సంబంధించి ఈ భావనలో లోపాలున్నాయి. ఓడలు వాటికవే రెట్టింపై పోవు. ఒక పర్యావరణ వ్యవస్థ సామర్థ్యం ఇంజనీర్ డ్రాయింగ్ రూములో నిర్ధారించడం సాధ్యం కాదు. అయితే, పర్యావరణ శాస్త్రవేత్తలు దశాబ్దాలుగా మానవ సమాజాలకు సంబంధించి ఇదే భావనను ఖచ్చితంగా వర్తింపజేస్తున్నామని చెబుతున్నారు. ఈ మాటలు చెప్పింది పర్యావరణ శాస్త్రవేత్త విలియం వోట్. ఆయన మొదటిసారి అంటే 1940 దశాబ్దంలో ఈ మాటలు చెప్పాడు. వ్యవసాయ భూమిని అతిగా వాడడం వల్ల భూమి సారం క్షీణిస్తుందని, చివరకు నాశనమవుతుందని అన్నాడు. 1960 దశకం చివరి నాటికి, 1970 ప్రారంభదినాల్లో పాల్ ఎర్లిచ్ ఆహార ఉత్పత్తిపై దృష్టి పెట్టాడు. తర్వాతి కాలాల్లో పర్యావరణ శాస్త్రవేత్తలు కాలుష్యాలపైనా, పర్యావరణ విధ్వంసం పైనా దృష్టి పెట్టి భూవ్యవస్థపై వాటి ప్రభావాన్ని అధ్యయనం చేసే ప్రయత్నం చేశారు. భూవ్యవస్థపైనే మానవజీవితం ఆధారపడి ఉంది.

కాని అందరూ మానవ పునరుత్పత్తి, మానవ అవసరాలకు సంబంధించిన జనాభా నియంత్రణను నొక్కి చెప్పే నియో మాల్థుషియన్ సిద్ధాంతం దృష్టితోనే ఆలోచించారు. 18వ శతాబ్దానికి చెందిన రెవరెండ్ థామస్ రాబర్ట్ మాల్థుస్ నుంచి నేటి వరకు పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నది ప్రగతి వికాసాల వల్ల మనుషుల జనాభా మరింత పెరుగుతుందని, దానివల్ల వనరుల వినియోగం మరింత పెరుగుతుందని చెప్పడమే. అంటే మనుషులు ఏకకణ జీవుల్లా లేదా దీపపు పురుగుల్లా సంఖ్యలో పెరిగిపోతుంటారు. వనరులన్నీ అంతరించి పోయేవరకు జనాభా ఇలా పెరిగిపోతూ ఉంటుందన్నదే ఈ భావన.

కాని వాస్తవానికి మానవ జనాభా పెరుగుదల, వనరుల వాడకం అనేది ఇలా జరగడం లేదు. ప్రగతి వికాసాలు, ఆధునికత వల్ల మానవ పునరుత్పాదక రేటు తగ్గుతోంది కాని పెరగడం లేదు. భౌతికంగా మనిషి జీవన పరిస్థితులు మెరుగైనప్పుడు పిల్లల సంఖ్య తగ్గుతుందే కాని ఎక్కువ కావడం లేదు. గత 200 సంవత్సరాలుగా మానవ జనాభా విస్ఫోటం అనేది మానవ పునరుత్పాదక రేటు పెరగడం వల్ల కాదు, శిశుమరణాల రేటు తగ్గడం వల్ల చోటు చేసుకుంది. మెరుగైన ప్రజారోగ్యం, పోషకాహారం, భౌతికమైన వసతులు, ప్రజలకు భద్రత వగైరా కారణాల వల్ల మనుషులు గతంలో కన్నా ఎక్కువ కాలం జీవిస్తున్నారు.

ప్రస్తుతం అమెరికా, యూరప్, జపాన్, చాలా వరకు లాటిన్ అమెరికా, కొంతవరకు ఇండియాలో పునరుత్పత్తి రేటు తగ్గిపోయింది. దంపతులు ఇద్దరు పిల్లలనే కలిగి ఉంటున్నారు. రానున్న దశాబ్దాల్లో ప్రపంచంలోని చాలా దేశాల్లో ఇలా జరగవచ్చు. ఫలితంగా చాలా మంది డెమోగ్రాఫర్ల ప్రకారం మానవజనాభా గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. ఆ తర్వాత జనాభా పడిపోవడం ప్రారంభమవుతుంది. ఈ శతాబ్దం చివరి నాటికి చాలా దేశాల్లో జనాభా తగ్గడం ప్రారంభమవుతుందని భావిస్తున్నారు.

అందువల్లనే నేడు పర్యావరణ సంక్షోభాలకు అధిక జనాభా కారణమన్న వాదన వినబడడం లేదు. వనరుల అతి వాడకం కారణం కావచ్చన్న వాదన వినిపిస్తుంది. ఇప్పుడు చాలా మంది చెప్పేదేమంటే, మానవ సమాజాలు ఏకకణ జీవుల వంటివి కావు. కాని పెట్టుబడిదారి వ్యవస్థ మాత్రం ఏకకణజీవి వంటిదే. వనరులను వాడుకోవడంలో అనియమిత ప్రగతి లేకపోతే బతికి బట్టకట్టలేదు. ఈ వాదనను సమర్ధించే ఆధారాలు పెద్దగా లేవు. దీనికి విరుద్ధంగా చాలా మార్కెట్ ఎకానమీ వ్యవస్థలు వనరులను తక్కువ వాడుకుని ప్రగతి సాధించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రజలు గ్రామీణ వ్యవసాయిక నేపథ్యం నుంచి ఆధునిక పారిశ్రామిక ప్రాంతాలకు తరలి పోవడంతో పాటు వారి జీవితాల్లోను మార్పు వచ్చింది. తర్వాత ఈ ధోరణి కూడా తగ్గుముఖం పట్టింది. ఇప్పుడు అమెరికా కూడా ఏటా 2 శాతం ప్రగతి నమోదు చేయడానికి కూడా తంటాలు పడుతోంది.

సంపన్న ఆర్థిక వ్యవస్థలు కూడా మార్పుకు గురవుతున్నాయి. ఒకప్పుడు ఆర్థిక ఉత్పాదకతలో మాన్యుఫాక్చరింగ్ కేవలం 20 శాతం ఉండేది. ఉద్యోగ కల్పనలో కూడా అంతే వాటా ఉండేది. నేడు ఇది 10 శాతానికి పడిపోయింది. ఇప్పుడు ఆర్థిక ఉత్పాదకత ప్రధానంగా సేవారంగం నుంచి వస్తుంది. ఈ రంగంలో వనరుల వాడకం, శక్తి వాడకం తక్కువే. అభివృద్ధి చెందిన దేశాల్లో దశాబ్దాలుగా ఆర్థిక ప్రగతిలో క్రమేణా వనరుల వాడకం తగ్గుతూ వస్తోంది. ఎందుకంటే డిమాండ్ సంతృప్తస్థాయికి చేరుకోవడం దానికి కారణం. ఏది ఏమైనా భూమి భరించే సామర్థ్యాన్ని మనం దాటిపోయే భయం లేదని కూడా పూర్తిగా చెప్పలేం. నిజానికి కొందరు పర్యావరణ శాస్త్రవేత్తల ప్రకారం భూమి సామర్థ్యాన్ని మించి పోయింది జనాభా. కాని భూమి సామర్థ్యం స్థిరంగా గతంలో ఊహించినంత మాత్రమే ఉంటుందనుకోవడంలోనే తప్పుంది.

**మిగతా 33వ పేజీలో...**



# నిరుద్యోగ సమస్యపై మౌనమేల?

రూహీ

**ఇటీవల** దేశంలో నిరుద్యోగ సమస్యపై వచ్చిన నివేదిక చాలా చింతాకరమైన దృశ్యాన్ని చూపిస్తోంది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ రూపొందించిన "ఇండియా ఎంప్లాయ్ మెంట్ రిపోర్ట్ 2024" ప్రకారం ప్రతి సంవత్సరం దాదాపు 80 లక్షల మంది నిరుద్యోగులు పెరుగుతున్నారు. దేశంలోని నిరుద్యోగుల్లో దాదాపు 83 శాతం యువకులే ఉన్నారు. సెకండరీ స్థాయి విద్యార్హతలున్న యువకుల్లో నిరుద్యోగం మరింత ఎక్కువగా ఉంది. 2000 సంవత్సరంలో నిరుద్యోగుల్లో సెకండరీ, ఆపై విద్యార్హతలున్న వారి శాతం 35.2 ఉంటే 2022 నాటికి 65.7 అయ్యింది. 2021 నాటికి భారత యువతలో కనీస ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నైపుణ్యాలు లేవని తెలుస్తోంది. ప్రతి నలుగురు యువతలో ముగ్గురికి కనీసం ఈ మెయిల్ పంపడం కూడా తెలియదు. ప్రతి పది మందిలో 9 మందికి ఎక్సెల్ షీట్ల గురించి తెలియదు. గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగం తొమ్మిది రెట్లు పెరిగింది. ఈ నివేదికను పరిశీలిస్తే దేశంలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పన ఎంత కరువ య్యాయో అర్థమవుతుంది.

ఉద్యోగం ఇప్పుడు గగన కుసుమం అయిపోయింది. చాలా ఉద్యోగాలు ఇచ్చామంటోంది ప్రభుత్వం.. నోట్లరద్దుతో ఉన్న ఉద్యోగాలు ఊడాయంటున్న సర్వే సంస్థలు... సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ సర్వే నివేదిక గతంలో వచ్చింది. ఆ నివేదిక ప్రకారం గత ఏడాది ఫిబ్రవరిలో నిరుద్యోగ రేటు అత్యధికంగా 7.2 శాతానికి చేరింది. 2016 తర్వాత ఈ స్థాయిలో నిరుద్యోగం పెరగడం అదే మొదటిసారి. అంతకు ముందు ఫిబ్రవరిలో ఇది 5.9 శాతం. దేశవ్యాప్తంగా వేల ఇళ్లలో సర్వే చేసి ఈ నివేదికను తయారు చేశారు. ఉద్యోగార్థుల సంఖ్య కూడా తగ్గిందట. అయినా నిరుద్యోగం రేటు పెరిగిందని ఆ సంస్థ చీఫ్ మహేశ్ వ్యాస్ తెలిపారు.

పెద్దనోట్ల రద్దు తర్వాత 2018లో దాదాపు 1.10 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారని సీఎంఐఈ నివేదిక పేర్కొంది. కాని మోడీ సర్కారు మాత్రం పెద్దనోట్ల రద్దు సాహసోపేతమైన నిర్ణయమనీ గొప్పగానే చెప్పుకుంటోంది. పుల్వామా ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌లో వాయుసేన దాడులు చేయించిన సాహసోపేత ప్రభుత్వంగా, జాతీయవాద భావాలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలని ప్రయత్నిస్తున్న నేపథ్యంలో వచ్చిన ఈ నివేదిక మోదీ సర్కారుకు ఏ మాత్రం రుచించలేదు. కాని పాకిస్తాన్‌తో యుద్ధం కన్నా నిరుద్యోగంతో యుద్ధం చాలా ముఖ్య మైందని పలువురు అప్పట్లోనే చెప్పారు. కాని ఏడాది గడిచినా ప్రభుత్వం తీసుకున్న చర్యలేవీ లేవు.

అభివృద్ధి చెందిన, వర్ధమాన దేశాల కంటే భారత్‌లోనే నిరుద్యోగ సమస్య అధికంగా ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ

సీనియర్ ఆర్థికవేత్త జాన్‌బ్లూడార్న్ అభిప్రాయపడ్డారు. బ్రూకింగ్స్ ఇండియా సంస్థ 'లేబర్ మార్కెట్ ఇన్ ఎమర్జింగ్ అండ్ డెవలపింగ్ ఎకనామిస్' అంశంపై ఏడాది క్రితం సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాన్‌బ్లూడార్న్ ప్రసంగించారు. భారత్‌లో నిరుద్యోగ సమస్య అధికమవుతోందని అన్నారు. భారతీయ యువత సోమరితనానికి బానిసవుతున్నారంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సోమరితనం కారణంగా 30శాతం మంది యువత ఉపాధి అవకాశాల కోసం ఏ మాత్రం ప్రయత్నించడంలేదని అన్నారు. భారత్‌లో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందన్నారు.

కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఉద్యోగాల విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నట్లు గతంలో మాట్లాడింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు భారత్‌లో పెద్దఎత్తున ఉద్యోగ సృష్టికి దోహదం చేస్తాయని సీఐఐ తెలిపింది. ముఖ్యంగా అభివృద్ధిలో దూసుకుపోతున్న ఎనిమిది రంగాల్లో 2025 నాటికి దాదాపు పది కోట్ల ఉద్యోగాలు వస్తాయని వెల్లడించింది. ఏడాది గడిచిన తర్వాత కూడా ఇప్పటికీ ఆ ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయో ఎవరికీ కనబడడం లేదు. 2025 నాటికి కేవలం నిర్మాణ రంగంలోనే దాదాపు 2.87 కోట్ల ఉద్యోగ అవకాశాలు వస్తాయని సీఐఐ అంచనా వేసింది. నిర్మాణ రంగం తర్వాత రిటైల్, రవాణా అండ్ లాజిస్టిక్స్ రంగాల్లో ఉద్యోగాలు ఎక్కువగా వస్తాయని సీఐఐ తెలిపింది. ఇప్పుడు 2024 మధ్యలో ఉన్నాం. ఆ ఉద్యోగాలు ఎక్కడ?

2025 నాటికి పదికోట్ల ఉద్యోగాలు వస్తాయని సిఐఐ చెబితే, మరోవైపు 2025లోగా దాదాపు 20 కోట్ల మంది నిరుద్యోగులుగానో ఏదో చిన్నా చితక పని చేసుకుంటూనో బతకడం ఖాయమని ఒక కొత్త పుస్తకం అప్పట్లోనే తేల్చేసింది. దేశంలో ఇప్పుడున్న ఎకానమీని, దాని భవిష్యత్తుని బేరీజు వేసుకుని చూస్తే భవిష్యత్తులో వైట్ కాలర్ జాబ్స్‌కి కరవు కాటకాలు తప్పవని 'జాబొనమిక్స్' అనే పుస్తక సారాంశం. సీనియర్ జర్నలిస్ట్ గౌతమ్ దాస్ ఈ పుస్తకం రాశారు.

ఒకవైపు సర్వే సంస్థలు ఉద్యోగాల్లేవని, నిరుద్యోగం పెరిగిపోయిందని అంటుంటే ప్రభుత్వం కోట్లాది ఉద్యాగాలు కల్పించామని చెబుతోంది. బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా లోక్‌సభలో మాట్లాడిన ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు ఎక్కు బెట్టారు. ప్రావిడెంట్ ఫండ్ లెక్కలు, పెన్షన్ల లెక్కలు చెప్పి తమ ప్రభుత్వ హయాంలో కోట్లాది ఉద్యోగాలు వచ్చాయన్నారు. సంఘటిత రంగంలోనో కోట్లాది ఉద్యోగాలు వస్తే ఉద్యోగాల్లేవా అని నిలదీశారు.

అసంఘటిత రంగంలో లెక్కకు మిక్కిలి ఉద్యోగాలున్నాయని, అసలు ఉద్యోగాలకు కరువే లేదని ఆయన చెప్పారు. డిమానిటైజేషన్ తర్వాత ఉద్యోగాలు పోయాయని చెప్పడం అబద్ధమా? అనే ప్రశ్న ఇక్కడ పుడుతుంది. ఏది ఏమైనా, 2017 నుంచి 2018 వరకు 15 నెలల కాలంలో 1 కోటి 80 లక్షల మంది ప్రావిడెంట్ ఫండ్‌లో చేరారని, నేషనల్ పెన్షన్ స్కీములో ఒక కోటి 20 లక్షల మంది చేరారని ఇలా వివిధ విభాగాల గణాంకాలు ఏకరువు పెడుతూ కోట్లాది ఉద్యోగాలు తమ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. కాస్త జాగ్రత్తగా వింటే ఈ ప్రసంగానికి, మోడీ అంతకు ముందు జనవరిలో జీ న్యూస్ చానల్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన మాటలకు పెద్ద తేడా కనబడదు. ఆ ఇంటర్వ్యూలోనే ఆయన పకోడీలు అమ్మడం కూడా ఉపాధియే కదా అన్నారు.

ప్రధాని మోడీ పకోడీలు అమ్ముకోవడం ఉపాధి కాదా అని ప్రశ్నించిన మాటల్లో అనౌచిత్యం ఏదీ లేదు. పకోడీలు అమ్మడం కూడా శ్రమైక జీవన సౌందర్యమే. ఇదే విషయాన్ని అమిత్ షా లోక్ సభలో బల్లగుద్ది మరీ వాదించారప్పుడు. అప్పుడు అమిత్ షా కూడా 55 సంవత్సరాల కాంగ్రెస్ పాలనను ఏకి పారేశారు. ఇప్పుడు మోడీ కూడా తూర్పారబట్టారు. కోట్ల ఉద్యోగాలు ఎలా వచ్చాయో చెప్పారు. మోడీ ఇంటర్వ్యూ వచ్చిన తర్వాత ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు సంధించాయి. రాజస్థాన్‌లో నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందంటే అసెంబ్లీ సెక్రటరియేట్‌లో ఐదు ప్యూన్ ఉద్యోగాలకు ఒకరు కాదు ఇద్దరు కాదు 23వేల మంది పోటీ పడ్డారు. వారంతా ఏదో చిన్నా చితకా చదువులు కాదు, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వాళ్ళు కొందరుంటే, మరికొందరు ఎంటెక్, లా పూర్తి చేసినవారు కూడా ఉన్నారు. ఉత్తరప్రదేశ్ పోలీసు డిపార్టుమెంటులో అతి క్రింది స్థాయి మెసెంజర్ ఉద్యోగాలు 62 పోస్టులు భర్తీ చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించినప్పుడు 50 వేల మంది గ్రాడ్యుయేట్లు, 28 వేల మంది పోస్టు గ్రాడ్యుయేట్లు, 3,700 మంది పిహెచ్‌డీలు దరఖాస్తు చేశారు. ఈ ఉద్యోగానికి కనీస విద్యార్హత కేవలం 5వ తరగతి. మొత్తం 93 వేల అప్లికేషన్లు 62 పోస్టులకు వచ్చాయి. దేశవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే కనిపిస్తుంది. తమిళనాడులో 992 మంది పిహెచ్‌డీలు, 23000 మంది ఎం.ఫిల్.లు గ్రామస్థాయిలో గుమాస్తా పనిచేయడానికి దరఖాస్తులు చేసుకున్నారు. ఖాళీలు 95000 ఉంటే మొత్తం 20 లక్షల దరఖాస్తులు వచ్చాయి.. దరఖాస్తు చేసుకున్న 20 లక్షల మందిలో

రెండున్నర లక్షల మంది పోస్టుగ్రాడ్యుయేట్లు. ఈ ఉద్యోగానికి కనీసార్హత కేవలం పదవతరగతి. పశ్చిమ బెంగాల్లోని జాదవ్‌పూర్‌లో 70 ప్యూన్ పోస్టులు భర్తీ చేయడానికి ప్రకటన ఇచ్చారు. 11వేల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్నవారిలో పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ, ఎం.టెక్, బి.టెక్, బియస్సీ అభ్యర్థులున్నారు. ఈ పోస్టుకు కనీస విద్యార్హత కేవలం 8వ తరగతి పాసవ్వడం. గత సంవత్సరం మే నెలలో హర్యానాలో కానిస్టేబుల్ ఉద్యోగాల రిక్రూట్మెంట్ సందర్భంగా ఎంబీఏ, బి.ఎల్, ఎల్.ఎల్.బీ, ఎం.టెక్ వంటి ఉన్నత విద్యార్హతలున్నవారు దరఖాస్తులు చేసుకున్నారు. దేశంలో అత్యధికంగా ఉద్యోగావకాశాలు కల్పించేది భారతీయ రైల్వే. రైల్వేల్లో లక్ష ఉద్యోగాలకు ప్రకటన వచ్చినప్పుడు రెండు కోట్ల మంది దరఖాస్తులు చేసుకున్నారు. అత్యధిక విద్యార్హతలున్నవారు కూడా చిరు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవడం దేశంలోని నిరుద్యోగ సమస్యకు నిదర్శనం.

వందలాది విద్యార్థులు ముంబయి రైల్వే ట్రాకులపై కూర్చుని ఉద్యోగాల కోసం ధర్నా చేసిన సంఘటన పరిస్థితి తీవ్రతను తెలుపుతుంది. ఉద్యోగావకాశాల గురించి ప్రభుత్వం చెబుతున్న మాటల్లో నిజాలు లేవని కాగ్‌రిపోర్టు కూడా స్పష్టం చేసింది. బీజేపి ఉద్యోగాలు కల్పించిన వారి పేర్ల జాబితా విడుదల చేయాలని కాంగ్రెస్ అప్పట్లోనే డిమాండ్ చేసింది.

లోక్ సభలో మోదీ తమ ప్రభుత్వం చాలా ఉద్యోగాలు కల్పించిం దని ప్రసంగం చేస్తున్నప్పుడు ఢిల్లీలో విద్యార్థులు ర్యాలీ తీశారు. ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్, ఛాత్ర యువ సంఘర్ష్ సమితి, యూత్ ఫర్ స్వరాజ్, స్టూడెంట్స్ ఫర్ సొసైటీ ఇలా అనేక సంఘాలు కలిసి యంగ్ ఇండియా అధికార్ మంచ్ పేరుతో ర్యాలీ తీశాయి. గడిచిన ఐదు సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోలేదని, కార్పొరేటీకరణ, కాషాయీకరణను ప్రోత్సహిస్తున్నదనీ, దేశ వ్యాప్తంగా వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూసివేశారనీ, ప్రవేటు యూనివర్సిటీలను ఆహ్వానించి ప్రభుత్వరంగ యూనివర్సిటీలను విస్మరించారని విద్యార్థులు విమర్శించారు. అనేక యూనివర్సిటీ లలో వేలాదిగా ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులు ఇప్పటికీ భర్తీ చేయలేదు. అధికారంలోకి వస్తే దేశంలో కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తా అని ప్రకటించిన నరేంద్ర మోదీ లక్ష ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు. 24 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా మిగిలిపోయాయి. పెట్టుబడిదారుల కోట్లాది రూపాయల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసినప్పుడు, విద్యార్థి ఎడ్యుకేషన్ లోన్‌లు ఎందుకు మాఫీ చేయరాదని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఎర్రకోట నుండి పార్లమెంట్ స్ట్రీట్ వరకు దేశంలోని అన్ని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో 30 వేల మందితో ర్యాలీ తీశారు.

పాటిదార్ నాయకుడు హార్దిక్ పటేల్ ఈ ర్యాలీకి మద్దతిచ్చాడు. కన్నయ్య కుమార్, జిగ్నేష్ మేవానీ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటేస్తున్న యువతరంలో 70 శాతం మొదటిసారి ఓటు వేస్తున్నవారే. వాళ్ళందరి ప్రధాన సమస్య ఉద్యోగం. ప్రధానమంత్రి ప్రావిడెంట్ ఫండ్ డాటా, పెన్షన్ డాటా, ముద్రా స్కీముల ఉదాహరణలిస్తూ కోట్ల ఉద్యోగాలు వచ్చాయని చెబుతున్నప్పటికీ నేషనల్ శాంపుల్ సర్వే రిపోర్టును మాత్రం బయటకు పొక్కకుండా తొక్కిపెడుతున్నారు. దేశంలో ఉద్యోగాల గణాంకాలు తీసే సరయిన వ్యవస్థ లేదని సర్కారు తప్పించుకోవాలనుకుంటోంది. దేశంలో కేవలం హొటల్ రంగంలోనే ఒక కోటి పాతిక లక్షల ఉద్యోగాలొచ్చాయని మోడీ అంటున్నారు. కాని ఉద్యోగాలెక్కడ అంటూ ప్రతిపక్షాలు నిలదీస్తు న్నాయి. విద్యార్థినాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యంగా విమర్శలు చేశారు. ఐదేళ్లు అబద్ధాలతోనే మోడీ పాలించారని, యువకులకు రెండుకోట్ల ఉద్యోగాలని హామీ ఇచ్చారని.. ఎక్కడ ఎవరికి ఉద్యోగాలిచ్చారో చెప్పాలన్నారు. నిరుద్యోగం చాలా పెద్ద సమస్య అని బీజేపీ నాయకుడు నితిన్ గడ్కరీ కూడా అంటున్నారు. పదిశాతం రిజర్వేషన్లివ్వడం సరే, కాని అసలు ఉద్యోగాలెక్కడ అంటూ ఆయన కూడా ప్రశ్నించారు. ఈ మాటలు బీజేపీని మరింత ఇరుకున పెట్టాయి. స్వయంగా బీజేపీ అగ్రనేత ఇలా చెప్పడంతో బిత్తరపోయారు.

బిజినెస్ స్టాండర్డ్‌లో ప్రచురించిన ఒక కథనం ప్రకారం 2016-17లో నిరుద్యోగం 6.1 శాతానికి చేరుకుంది. 1972 తర్వాత ఈ స్థాయిలో నిరుద్యోగం ఎప్పుడు లేదు. మన్మోహన్ రెండవసారి ప్రధాని అయినప్పుడు కూడా నిరుద్యోగం కేవలం 2.2 శాతం మాత్రమే. నేషనల్ శాంపుల్ సర్వే నివేదికలో ఈ వివరాలు ఉన్నట్లు పత్రిక రాసింది. ఆ వెంటనే నీతి ఆయోగ్‌కు చెందిన రాజీవ్ కుమార్, మరో ప్రభుత్వ అధికారి అమితాబ్ కాంత్ లను ప్రభుత్వం రంగంలోకి దింపింది. ఈ లెక్కలు సరయినవి కావంటూ వారిద్దరు వివరణలు ఇచ్చారు. ఇది తుది నివేదిక కాదని, అసలు తాము నిరుద్యోగ డేటాను విడుదల చేయలేదని నీతి ఆయోగ్ తెలిపింది. ఇంకా వివరాల సేకరణ ప్రక్రియ కొనసాగుతోందని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ అప్పట్లో చెప్పారు.

ప్రతి యేటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామంటూ అధికారం లోకి వచ్చిన బిజెపి ఏలుబడిలో దేశం మొత్తం ఉపాధి సంక్షోభం లో కూరుకుపోయిందని పలువురు విమర్శిస్తున్నారు. 45 ఏళ్ళ కాలంలో ఎన్నడూ లేని రీతిలో రికార్డుస్థాయిలో నిరుద్యోగం పెరిగింది.

నిరుద్యోగ రేటు 27 నెలల గరిష్టానికి చేరుకోగా, కార్మికుల భాగస్వామ్యం కూడా అంతే స్థాయిలో పడిపోయిందని సిఎంఐఇ నివేదిక వెల్లడించింది. 2018లో గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ నష్టాలు పెరగడంతో పట్టణ ప్రాంతాల్లో కూడా ఉద్యోగ నష్టాలు పెరుగుతున్నాయి. నిరుద్యోగం నానాటికి సంక్షోభంగా మారుతుంది.

భారత్‌లో లెక్కలేనని స్టార్టప్‌లు పెరగాలని ప్రధాని మోడీ గతంలో దేశ యువతకు సూచించారు. భారత్‌ను 10 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా చూడడమే తన లక్ష్యమని తెలిపారు. కాని స్టార్టప్‌లు కూడా పుంజుకోవడం లేదు. నిరుద్యోగం,ఉపాధి లేమి నిరాశా నిస్పృలు అలుముకుంటున్నాయి.

లేబర్ బ్యూరో కూడా గతంలో ఒక నివేదిక విడుదల చేసింది. 2014లో నిరుద్యోగం 3.4 శాతం ఉంటే, 2015లో 3.7 శాతానికి, ఆ తర్వాత 2016లో 3.9 శాతానికి పెరిగిందని చెప్పింది. 2018లో నిరుద్యోగం 7.4 శాతానికి పెరిగిందని సెంటర్ ఫర్ మానిటారింగ్ ఇండియన్ ఎకనామీ సర్వే చెబుతోంది. అజీమ్ ప్రేంజీ యూనివర్శిటీ కూడా నిరుద్యోగంపై ఆందోళన వ్యక్తం చేసింది. 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకనమీ నిర్వహించిన సర్వేలో ఒక్క 2018 సంవత్సరంలోనే ఒక కోటీ పదిలక్షల ఉద్యోగాలు పోయాయని అందులో 22 లక్షల ఉద్యోగాలను పురుషులు కోల్పోగా, 88 లక్షల ఉద్యోగాలను మహిళలు కోల్పోయారని తెలిసింది.

మోడీ ప్రభుత్వం నిరుద్యోగం, పేదరికం వంటి వివిధ అంశాల అధ్యయనానికి తోడ్పడే గణాంకాల విభాగాలను స్వతంత్రంగా పని చేయనివ్వడం లేదని ప్రొఫెసర్ జయతిఘోష్ విమర్శించారు. గణాంకాలు వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడానికి ఉపయోగ పడతాయని, ఆ వివరాల ఆధారంగా ఒక శాస్త్రీయ పద్ధతిలో ప్రణాళికలు రూపొందించడానికి, ప్రాధాన్యతా క్రమంలో వనరులను కేటాయించడానికి వీలవుతుందని ఆమె తెలిపారు. సిఎంఐయి సియిఓ మహేష్ వ్యాస్ కూడా అదే మాట చెబుతున్నారు.

సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అదనంగా కల్పిస్తామని బిజెపి 2014లో వాగ్దానం చేసింది. అలా చేయకపోగా ఉన్న ఉద్యోగాలే ఊడిపోతున్నాయి. ప్రభుత్వ శాఖల్లో సైతం లక్షలాది ఖాళీలు ఉన్నా, వాటిని కూడా భర్తీ చేసేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. పైగా వాస్తవాలను కప్పిపుచ్చేందుకు, వక్రీకరించేం దుకు నానా తంటాలూ పడుతోంది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమాన్ని చేపట్టారు. దీని వల్ల అదనంగా పెట్టుబడులేమీ రాలేదు. పైగా 2016 నవంబరులో పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశ వృద్ధిరేటు నాలుగేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 6.6 శాతంగా నమోదైంది. కొన్ని లక్షల మంది ఉపాధి కోల్పోయారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతబడ్డాయి. ఖాళీగా ఉండే బదులు పకోడి షాప్ పెట్టుకోవాలని ప్రధాని సలహా ఇచ్చారు. అదీ కూడా ఓ ఉద్యోగమేనన్నారు. దీన్ని అమిత్ పార్లమెంట్ వేదికగా సమర్థించారు. ప్రధాని మోదీ ఎక్కడికెళ్లినా వారి సభలు ముందు పకోడిషాపులు పెట్టి యువత నిరసన తెలిపారు. తర్వాత త్రిపుర ముఖ్యమంత్రి ఆవులు పెంచుకోమని పాన్ షాపు పెట్టుకోమని యువతకు సలహా ఇచ్చారు.

నిరుద్యోగం గురించి ఈ చర్చ తీవ్రంగా ఒకవైపు జరుగుతున్నప్పుడే పుల్వామా ఉగ్రదాడి జరగడంతో చర్చ వెనక్కు వెళ్ళింది. జాతీయవాదం ప్రముఖంగా చర్చకు వచ్చింది. వాయుసేన దాడుల తర్వాత మోడీ ప్రతిష్ఠ పెరిగిందని, ఇక బీజేపీ విజయం ఖాయ మని బీజేపీ నేతలు బహిరంగంగానే చెప్పడం ప్రారంభించారు. ఈ లోగా మరోసారి నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందంటూ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఎకానమీ సంస్థ నివేదిక వచ్చింది. అంతేకాదు, పాకిస్తాన్‌తో యుద్ధం కన్నా నిరుద్యోగంపై యుద్ధం చాలా ముఖ్యమైనదని సిఎంఐయి సియిఓ మహేష్ వ్యాస్ అన్నారు.

బిజెపి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు పదేళ్ళలో 25 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అంటే ఏటా రెండున్నర కోట్ల ఉద్యోగాలు. 2015లో కేవలం 1.55 లక్షల ఉద్యోగాలు, 2016లో 2.31 లక్షల ఉద్యోగాలు, 2017లో 4.16 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఇవ్వగలిగారు. పెరుగుతున్న నిరుద్యోగుల సంఖ్య, ఇస్తున్న ఉద్యోగాల రేటు చూస్తుంటే భవిష్యత్తులో భయంకరమైన సంక్షోభ పరిస్థితి తలెత్తేలా ఉంది. ఏటా నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోంది. కొత్త ఉద్యోగాలు ఎక్కడా కనబడడం లేదు. భవిష్యత్తు ఎలా ఉంటుందో ఇక ఊహించుకోవచ్చు. ఈ నేపథ్యంలోనే సార్వత్రిక ఎన్నికలు మరోసారి వచ్చాయి. ఈ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం నిరుద్యోగం గురించి మాట్లాడడం లేదు, హిందువుల ఆస్తులను కాంగ్రెసు లాక్కుని ముస్లిములకు పంచిపెడుతుందంటూ విద్వేష ప్రసంగాలు చేస్తున్నారు. మరోసారి హిందూ ముస్లిం రాజకీయాలే గెలుస్తాయా? లేక ప్రజా సమస్యలు గెలుస్తాయా? అన్నది ఎన్నికల ఫలితాల్లోనే తెలుస్తుంది.

# డాటా కోసం కోటి ఉపాయాలు

\- ఉమైర్

ఇటలీలోని డాటా ప్రొటెక్షన్ సంస్థ చాట్ జిపిటీ విషయంలో ఆందోళన వ్యక్తం చేసింది. తమ దేశంలోని డాటా ప్రొటెక్షన్ నిబంధనలను చాట్ జిపిటి ఉల్లంఘిస్తుందని తెలిపింది. ఓపెన్ ఏఐ వినియోగదారుల డాటాను సేకరించడానికి ఉపయోగించే పద్ధతులు దేశంలోని ప్రయివసీ చట్టాలకు వ్యతిరేకమైనవని అభ్యంతరం చెప్పింది.

డాటా విషయంలో ఇప్పుడు ప్రభుత్వాల వైఖరి మారుతోంది. డాటా ప్రపంచీకరణ దశ ఇప్పుడు అంతరించింది. దేశాల సరిహద్దులు దాటి డాటా స్వేచ్ఛగా ప్రవహించే కాలం గతించింది. జాతీయ భద్రత, ఆర్థిక ప్రయోజనాలు ఇలా అనేక కారణాల వల్ల డాటా విషయంలో ఇప్పుడు కొత్త ఆంక్షలు వస్తున్నాయి. అమెరికా, యూరప్ దేశాలు డాటా విషయంలో భద్రత చర్యలు తీసుకుంటున్నాయి. తమ జాతీయ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తున్నాయి. చైనా అయితే ఈ విషయంలో ఏమాత్రం సడలింపులకు అవకాశం ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో భారతదేశం ఏం చేయాలన్న ప్రశ్న కీలకమైనది. భారతదేశం డాటాకు సంబంధించి మొన్నటి వరకు ఎలాంటి ఆంక్షలు విధించలేదు. దేశంలోని అపారమైన డాటా ప్రపంచంలో అందరికీ అందుబాటులో ఉండేది. చివరకు చైనా కంపెనీలు, పెట్టుబడిదారులు కూడా భారతదేశంలోని మార్కెట్ డాటాతో ప్రయోజనాలు పొందారు.

ఇప్పుడు డాటాను కాపాడుకోవాలనే కొత్త ఆలోచనలు ప్రారంభమయ్యాయి. దీనికి భౌగోళిక రాజకీయాల మార్పులు కారణం కావచ్చు. ఏది ఏమైనా ఇప్పుడు ప్రపంచీకరణ పాతబడింది. స్థానికీకరణకే ప్రాధాన్యం ఇస్తున్నారు. అంతర్జాతీయ సంబంధాల్లో నమ్మకం అనేది దాదాపు శూన్యమైన పరిస్థితి ఏర్పడింది. ప్రపంచీకరణ పేరుతో లాభాలు పొందిన దేశాలు కూడా ఇప్పుడు స్థానికీకరణ వైపు మొగ్గు చూపుతున్నాయి. అమెరికాలో సైబర్ స్పేస్ దిగ్గజాలు ఇంటర్నెట్ ఫ్రీడం లీగ్ గురించి మాట్లాడుతుంటాయి. ఇంటర్నెట్ ఫ్రీడం గొప్పల గురించి చెబుతుంటారు. ఇంటర్నెట్ ఫ్రీడం అంటే ఇంటర్నెట్ వినియోగదారులందరినీ ఒకే వేదికపై సమైక్య పరచడం. కంపెనీలు, దేశాలన్నింటిని ప్రజాస్వామిక ప్రమాణాల స్ఫూర్తితో సమైక్యపరచడంగా చెబుతుంటారు.

యూరపులో బలమైన ఆర్థిక శక్తులు ఫ్రాన్సు, జర్మనీ దేశాలు. ఈ రెండు దేశాలు కలిసి ఇప్పుడు యూరోపియన్ క్లౌడ్ ఇనీషియేటివ్ ఏర్పాటు చేసుకోవాలని బలంగా వాదిస్తున్నాయి. అంటే యూరపులో ఒకే ఒక్క డిజిటల్ మార్కెటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలన్నది వారి అభిప్రాయం. దీనికి కారణం అమెరికా పై ఆధారపడకుండా ఉండాలన్న కోరిక. అమెరికాలోని అమెజాన్ వెబ్ సర్వీస్ ఇప్పుడు డిజిటల్ డాటా విషయంలో గుత్తాధిపత్యం సంపాదించుకుంటుంది. అమెజాన్ వెబ్ సర్వీస్ వంటి అమెరికన్ టెక్నాలజీ కంపెనీలపై ఆధారపడడం తగ్గించాలని యూరోపియన్ దేశాలు భావిస్తున్నాయి. మరో మాటలో చెప్పాలంటే యూరపు దేశాలు ఇప్పుడు డాటా సార్వభౌమాధికారం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. తమ డాటాపై తమ అధికారాలు మాత్రమే ఉండాలని భావిస్తున్నాయి.

ఓపెన్ డాటా మార్కెట్ విషయానికి వస్తే ప్రపంచంలోనే భారతదేశం అతిపెద్దది. 2024 పూర్తయ్యే నాటికి దేశంలో దాదాపు 110 కోట్ల మంది భారతీయులు స్మార్ట్ ఫోన్లు వాడతారని అంచనా. ప్రస్తుతం ప్రతి ఫోనులో నెలకు 9.8 గిగా బైట్ల డాటా వాడుతున్నారు. 2024 నాటికి నెలకు డాటా వాడకం ప్రతి ఫోనుకు 18 గిగా బైట్లకు చేరుకుంటుందని అంటున్నారు. ప్రపంచంలో అత్యధికంగా స్మార్ట్ ఫోన్ డాటా వాడకం జరుగుతున్నది ఇక్కడే. అందువల్లనే డాటా అనేది జాతీయ సంపదగా మారిపోయింది. భారతదేశంలో ఇంత విస్తారమైన డాటా మార్కెటు ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా ప్రముఖ డాటా కంపెనీల్లో భారత కంపెనీలు ఏవీ లేవు. డాటా సరఫరా చేస్తున్నాం, కాని డాటాను వాణిజ్య పరమైన పెట్టుబడిగా మార్చలేకపోతున్నాం. ఈ లోటును భర్తీ చేయడానికే భారత ప్రభుత్వం డాటా విషయంలో, డాటా సార్వభౌమాధికారం విషయంలో రాజీ పడేది లేదని ప్రకటించింది.

దేశంలోనే డాటా సర్వర్లు ఉంటే ఆర్థిక ప్రగతికి కూడా అవకాశాలు ఎక్కువ ఉంటాయన్న వాదన బలం పుంజుకుంటుంది. డాటా ఆర్థిక లాభాలకు ఉపయోగపడేలా మార్చే పద్ధతి ప్రక్రియలేమి

టన్నది మరో చర్చ. కాని కొన్ని అధ్యయనాలు మాత్రం అంతర్జాతీయంగా డాటా స్వేచ్ఛను అడ్డుకోవడం వల్ల దేశాల ఆర్థిక ప్రగతిపై ప్రభావం పడుతుందని చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత దేశంలో డాటా భద్రతకు మరిన్ని చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు మరోవైపు పెరుగుతున్నాయి.

డాటా విషయంలో భారత ప్రభుత్వం ఆగ్రహించడానికి కారణాలున్నాయి. ప్రతి సంవత్సరం బిగ్ టెక్ కంపెనీలు మరింత భారీ కంపెనీలుగా మారుతున్నాయి. భారతదేశం నుంచి ఈ కంపెనీలు పొందుతున్న డాటాయే దానికి కారణం. భారతదేశానికి సంబంధించిన డాటాను భారతదేశానికి సంబంధం లేని కంపెనీలు తమ సర్వర్లలో నిల్వ ఉంచుతున్నాయి. భారత అధికారులకు కాని, భారత ప్రభుత్వ సంస్థలకు కాని ఈ సర్వర్లలో డాటాను చూసే అవకాశం లేకుండా పోతోంది. అయితే, డాటా భారతదేశంలోనే ఉన్న సర్వర్లలో స్టోర్ చేసినా కూడా బహుశా పరిస్థితి ఇలాగే ఉండవచ్చు. మరోవైపు డాటా సెంటర్లను నిర్మించడం, ప్రపంచ డాటా మార్కెటుతో పోటీపడడం వంటివి సమీప భవిష్యత్తుల్లో జరిగేలా కనబడడం లేదు. ఇలా అనేక కారణాల వల్ల ఇప్పుడు భారతదేశం ఓపెన్ డాటా మార్కెట్ నుంచి క్లోజెడ్ డాటా మార్కెట్‌గా మారబోతోంది. చాలా మంది అధికారులు, స్టార్టప్ పండితులు ఇప్పుడు లోపాయికారిగా చైనా మోడల్ గురించి మాట్లాడుతున్నారు. అంటే ఇండియన్ డాటా ఎవరికీ లభించకుండా తలుపులు మూసేయడం, లేదా ఇండియన్ డాటా చాలా ఖరీదైనదిగా చేయడం. పర్సనల్ డాటా ప్రొటెక్షన్ బిల్ 2018 వివిధ రకాల డాటాను స్థానికీకరణ చేయడానికి ఉద్దేశించింది. ఈ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు మరిన్ని వివరాలు మన ముందుకు రావచ్చు.

కాని గమనించవలసిన విషయమేమంటే, భారతదేశం చైనా వంటిది కాదు. బిగ్ టెక్ కంపెనీలు ఇక్కడ కాలుమోపి చాలా కాలమైంది. బెంగుళూరు తదితర నగరాల్లో వాటి కార్యాలయాలున్నాయి. అందువల్ల డాటా సరఫరా ఆగిపోయేలా తలుపులు మూసేయడం పూర్తిగా సాధ్యపడకపోవచ్చు. కాని కొంతవరకైనా పరిమితులు ఆంక్షలు విధించడం అవసరమే.

పూర్తిగా స్వేచ్ఛావిపణి కాకుండా, అలాగే పూర్తి నిషేధాలు కాకుండా ఒక సమతుల్యాన్ని సాధించాలనే వాదనలు వినిపిస్తున్నాయి. డాటాలో కొన్ని కేటగిరీలు పూర్తిగా భారతదేశ హద్దుల్లోనే ఉండాలని, బిగ్ టెక్ కంపెనీలు తమ డాటా ప్రభుత్వ అధికారులకు అవసరమైతే అందుబాటులో ఉంచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. వైద్యం, విద్య, పట్టణీకరణ తదితర రంగాల్లో అభివృద్ధి ప్రాజెక్టులకు ఈ డాటా ఉపయోగించవచ్చు. ఇది డాటాను స్థానికీకరించడంతో పాటు ప్రపంచీకరణకు కూడా అనుకూలంగా ఉంచడం అవుతుంది.

సరికొత్త డాటా షేరింగ్ ఆర్కిటెక్చర్ కోసం జి20 తదితర అంతర్జాతీయ కూటములు ప్రస్తుతం ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రయత్నాలుకు దూరంగా ఉండే బదులు, ఈ ప్రయత్నాల్లో భారతదేశం నాయకత్వ పాత్ర పోషించవచ్చు. జపాన్ వంటి ధనిక దేశాలకు, ఇతర దేశాలకు మధ్య వారధిగా మారవచ్చు. దేశంలోని అతిపెద్ద డాటా మార్కెట్ మన బలం. జి20 తదితర వేదికల నుంచి అవసరమైన మినహాయింపులు పొందడానికి ఈ బలాన్ని ఉపయోగించవచ్చు.

## 27వ పేజీ తరువాయి...

నిజానికి మానవజాతి పర్యావరణాన్ని మరింత ఉత్పాదకంగా మార్చుకుంటోంది. అడవులను గడ్డిమైదానాలుగా, వ్యవసాయ భూములుగా మార్చేసింది. మొక్కలు, జంతువులు మనిషికి మరింత ఉపయోగకరమైనవాటిని ఎంచుకోవడం జరిగింది.

భూమి సామర్థ్యాన్ని మరింత పెంచడం మనిషికి సాధ్యమే. అణుశక్తి, సౌరశక్తి కావలసిన శక్తి అవసరాలను తీర్చడానికి ఉన్నాయి. పైగా ఇవి కార్బన్ వాయువులు విడుదల చేసే భయం కూడా లేదు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పెరిగే జనాభాకు అవసరమైన ఆహారం కూడా అందించగలవు. కాని ఈ భవిష్యత్తు చాలా మందికి, భూమి సామర్థ్యం పరిమితమని వాదించేవారికి రుచించేది కాదు. కాని ఇందులో ఆశావాదం ఉంది. వివేకంతో విజ్ఞానంతో మానవజాతి భవిష్యత్తును నిర్మించుకోగలదు. భూమి సామర్థ్యం ప్రకారం మానవప్రగతిని నిరోధించాలనుకోవడం సరయిన ఆలోచన కాదు.

మాల్థస్ అధిక సంతానం గురించి మాట్లాడాడు, ఎర్లిచ్ పేద దేశాలకు ఆహార సహాయాన్ని నిరసించాడు. బలవంతంగా కుటుంబ నియంత్రణ గురించి కూడా వాదించారు. ఇప్పుడు కోట్లాది మందిని వ్యవసాయిక సంక్షోభంలో ముంచేసే పరిస్థితిని నివారించకుండా భూమి పరిమితుల గురించి మాట్లాడడం జరుగుతోంది. ఏది ఏమైనా, మానవ సమాజాలపై కుహనా కల్పిత పరిమితులను విధించడం సరయిన పద్ధతి కాదు. భూమిపై మానవజాతి చరిత్రను పరిశీలిస్తే మనిషి ఈ భూమిని తన అవసరాలకు అనుగుణంగా అనేకసార్లు అనేకరకాలుగా తయారు చేసుకున్నాడు. ❖

17వ పేజీ తరువాయి...

దివ్యఖుర్ఆన్ ప్రకటించే మరో ముఖ్యమైన విషయమేమిటంటే, ఇస్లాం అనేది కొత్త ధర్మం కాదు. అనేకమంది ప్రవక్తలు తీసుకొచ్చిన ధర్మం ఇదే. దీనికి కొనసాగింపుగానే దివ్యఖుర్ఆన్ వచ్చిందన్న వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది.

"ప్రస్తుతం నా కాలంలో ఉన్న తౌరాతు గ్రంథోపదేశాలను ధ్రువపరచ టానికి నేను వచ్చాను. ఇంకా, పూర్వం మీకు నిషేధించ బడిన (హరామ్) కొన్ని వస్తువులను ధర్మసమ్మతం (హలాల్) చెయ్యటానికి కూడా వచ్చాను." (దివ్యఖుర్ఆన్ 3:50)

దివ్య ఖుర్ఆన్ సందేశంలోని ముఖ్యమైన అంశం దేవుడు ఒక్కడే అని చెప్పడం. మనుషులంతా ఒక్కటే అని చెప్పడం. ఈ ఏకత్వమే దివ్యఖుర్ఆన్ ముఖ్యమైన సందేశం.

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను తెంచటం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి." (దివ్య ఖుర్ఆన్ 4:1)

"ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణినుండి పుట్టించాడు. ఇంకా ప్రతి ఒక్కరికీ ఒక నివాస స్థలం ఉంది. అప్పగించబడే ఒక స్థలం ఉంది." (దివ్య ఖుర్ఆన్ 6:98)

"మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించినవాడు ఆయనే, తిరిగి ఆయనే ఆ ప్రాణి నుండి దాని జంటను సృజించాడు. ఇంకా ఆయనే మీ కొరకు పశువులలో ఎనిమిది మగ, ఆడ జాతులను సృష్టించాడు. ఆయన మీ తల్లుల గర్భాలలో మూడేసి చీకటి తెరలలో మీకు ఒక రూపం తరువాత మరొక రూపాన్ని ఇస్తూ పోతున్నాడు. (ఈ కార్యాలు నిర్వహించే) ఈ దేవుడే మీ ప్రభువు, సృష్టి సామ్రాజ్యం ఆయనదే. ఆయన తప్ప మరొక దేవుడు ఎవ్వడూ లేడు. (దివ్య ఖుర్ఆన్ 39:6)

మానవులంతా ఒక్కటే అనే మాటను పలుమార్లు దివ్యఖుర్ఆన్ ప్రకటించింది. మనుషుల మధ్య ఎలాంటి హెచ్చుతగ్గులు లేవని, అందరి దేవుడు ఒక్కడే అని స్పష్టం చేసింది.

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసిన వాడూను." (దివ్య ఖుర్ఆన్ 49:13)

మానవ సమానత్వంతోపాటు దివ్యఖుర్ఆన్ గట్టిగా చెప్పిన మరో మాట సమాన న్యాయం. న్యాయం విషయంలో దివ్య ఖుర్ఆన్ ప్రకటించిన మాటలు నేటికి కూడా ఎంతో ముఖ్యమైనవి.

"విశ్వసించిన ప్రజలారా! న్యాయధ్వజ వాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదల యినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగ కండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు అని." (దివ్య ఖుర్ఆన్ 4:135)

"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరిసమాన మైనది." (దివ్యఖుర్ఆన్ 58)

న్యాయాన్ని కాపాడడానికి దివ్యఖుర్ఆన్ ప్రకటించిన ఈ మాటలు ఆధునిక సమాజాలకు ఎంతైనా పాటించదగినవి. ఈ బోధనల ద్వారా దివ్యఖుర్ఆన్ ఒక శాంతియుత, ప్రశాంత సమాజాన్ని, శాంతియుత నాగరికతను సాధించాలని చెబుతుంది.

"మీ వద్దకు అల్లాహ్ తరపు నుండి కాంతి వచ్చేసింది. సత్యం వైపునకు మార్గం చూపే ఒక గ్రంథం కూడా. దాని ద్వారా అల్లాహ్ తన సంతోషం పొందగోరేవారికి శాంతి పథాలను చూపుతాడు. తన ఇచ్ఛానుసారం వారిని చీకట్ల నుండి వెలికితీసి వెలుగు వైపునకు తీసుకువస్తాడు. ఇంకా వారిని రుజుమార్గం వైపునకు నడుపుతాడు" (దివ్యఖుర్ఆన్ 5:16)

అంతేకాదు, ధర్మం విషయంలో ఎలాంటి బలవంతం కూడా తగదని స్పష్టంగా ప్రకటించడం ద్వారా మతపరమైన ఉద్రిక్తతలు లేని వాతావరణం ఏర్పాటు కావాలని అభిలషిస్తుంది.

"ధర్మం విషయంలో నిర్బంధంకానీ, బలాత్కారంకానీ లేవు" (దివ్య ఖుర్ఆన్ 2:256)

సమానత్వం, న్యాయం, శాంతి ఇవి మానవసమాజాలకు ఎంతైనా అవసరం. వీటిని సాధించే జీవన విధానాన్నే దివ్యఖుర్ఆన్ బోధిస్తుంది. దివ్యఖుర్ఆన్ మనిషి గురించి మాట్లాడుతుంది. మానవ సమాజాలను మంచి సమాజాలుగా మార్చడం గురించి మాట్లాడుతుంది.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**